మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 5-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 187 Issue: 187

05 జనవరి 2026 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:51 సూర్యాస్తమయం - సా. 5:51 తిథి విదియ ఉ. 9:59 వరకు తరువాత తదియ సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం పుష్యమి మ. 1:26 వరకు తరువాత ఆశ్లేష యోగం విష్కంభ రా. 10:51 వరకు కరణం గరజి ఉ. 9:59 వరకు వనిజ రా. 8:59 వరకు వర్జ్యం రా. 1:36 నుండి తె. 3:07 వరకు దుర్ముహూర్తం మ. 12:43 నుండి మ. 1:27 వరకు మ. 2:55 నుండి మ. 3:39 వరకు రాహుకాలం ఉ. 8:13 నుండి ఉ. 9:36 వరకు యమగండం ఉ. 10:58 నుండి మ. 12:21 వరకు గుళికాకాలం మ. 1:44 నుండి మ. 3:06 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:15 నుండి ఉ. 6:03 వరకు అమృత ఘడియలు ఉ. 7:28 నుండి ఉ. 8:57 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:59 నుండి మ. 12:43 వరకు గమనిక: ఁ అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



## తెలంగాణ.. ఊటీ!

ఊటీని తలపిస్తున్న కొన్ని ప్రాంతాలు

### రాష్ట్రంలో కొత్త వాతావరణ పరిస్థితులు

**ఈదురుగాలులతో జనం గజగజ**

**ఈ నెల 8 వరకు పలు జిల్లాలకు ఆరెంజ్**

**మరింత చలితీవ్రత పెరిగే అవకాశం**

**హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి**

రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు గతం కన్నా భిన్నంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు, దట్టమైన పొగమంచు వల్ల కొన్ని ప్రాంతాలు పర్యాటక ప్రాంతమై ఊటీని గుర్తుకు తెస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో ఉదయం 10 గంటల వరకు దట్టమైన పొగమంచు వీడటం లేదు. హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటంతో అనంతగిరి కొండలు పర్యాటకులతో కిక్కిరిసిపోతున్నాయి.

హైదరాబాద్, జనవరి 4 (ఈవార్తలు): తెల్లవారుజామున కొండల మధ్య మంచు కురుస్తుండటంతో పర్యాటకులు అటు దారి పడుతున్నారు. ఇక, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి ఘాట్ రోడ్డులో ప్రయాణం మున్నార్‌ను తలపిస్తోంది. ఇక్కడ ఉష్ణోగ్రతలు 10-12 డిగ్రీల కనిష్టానికి పడిపోయాయి. ఈ చలికాలపు అందాలను ఆస్వాదించేందుకు ప్రజలు వారాంతాల్లో అనంతగిరి కొండలు, లక్నవరం చెరువు, నాగార్జున సాగర్ వంటి ప్రాంతాలకు క్యూ కడుతున్నారు.

**మరో వారం ఇవే పరిస్థితులు**

హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, అదిలాబాద్ వంటి జిల్లాల్లో దట్టమైన పొగమంచు కారణంగా విజిబిలిటీ 50 మీటర్ల కంటే తక్కువకు పడిపోయింది. రవాణా అంతరాయం: హైదరాబాద్-విజయవాడ హైవే, ఔటర్ రింగ్ రోడ్‌పై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాలైన రాజేంద్రనగర్, శంషాబాద్, నార్సింగి మరియు గ్రామీణ ప్రాంతాల్లో పొగమంచు - 2 వ పేజీలో...



## ఏప్రిల్‌లో ఇందిరమ్మ 2

**అర్హులైన ప్రతి పేదకు పక్కా ఇల్లు.. మూడు విడతల్లో పంపిణీ పూర్తి.. మంత్రి పొంగులేటి**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం రోజున ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం మున్సిపాలిటీలో పర్యటించారు. ఈ క్రమంలోనే దాదాపు రూ. 1.07 కోట్ల వ్యయంతో పలు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

ఏదులాపురం, జనవరి 4 (ఈవార్తలు): గడిచిన పదేళ్లలో పేదవాడికి ఒక ఇల్లు ఇవ్వాలనే జ్ఞానం గత ప్రభుత్వానికి లేదని అన్నారు. ఆత్మగౌరవంతో పేదవాడు తలదాచుకునే నీడ ఇవ్వకుండా పదేళ్లు బొమ్మలు చూపి కాలక్షేపం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాదే రూ. 22,500 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. గత ప్రభుత్వంలాగా అబద్ధపు హామీలతో ప్రజలను వంచించే రకం తమ ప్రభుత్వానిది కాదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇప్పటికే ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో 560 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు. ఏప్రిల్‌లో రెండో విడత ఇళ్లు ఇస్తామని చెప్పారు. మొత్తం ఇంకా మూడు విడతలుగా అర్హులైన ప్రతి పేదవాడికీ పక్కా ఇల్లు కట్టించి తీరుతామని చెప్పారు. ఏదులాపురం అభివృద్ధికి గడిచిన తరువాయి 2 వ పేజీలో...

## జర.. చెప్పిపోర్రి!

**సంక్రాంతికి ఊరెళ్తే పోలీసులకు చెప్పండి**

**హైదరాబాదీలకు సీపీ సజ్జనార్ సూచనలు**

**నగదు, బంగారం లాకర్లలోనే దాచుకోవాలని హితవు**



సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే హైదరాబాదీలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ సూచించారు. పండుగ సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఎక్కువ రోజులు బయటికెళ్లే వారు.. వెళ్లే ముందు తప్పనిసరిగా స్థానిక పోలీసులకు చెప్పి వెళ్లాలన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విటర్) వేదికగా నగరవాసులను అప్రమత్తం చేశారు. 2

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,582 |
| వెండి (గ్రాము): | రూ.257 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,204 |

## నువ్వు ఎవడివి రా?

**కాంగ్రెస్‌ను తొక్కుతానంటే ఊరుకోం**

**కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దెబ్బతిస్తే సహించం**

**ఎమ్మెల్యే లక్ష్యంగా జీవన్ రెడ్డి వ్యాఖ్యలు**



జగిత్యాల, జనవరి 4 (ఈవార్తలు) : జగిత్యాల జిల్లా రాజకీయం మరింత హీటెక్కింది. అధికార కాంగ్రెస్ పార్టీలో పాత, కొత్త నేతల మధ్య విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. తాజాగా జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అంటే అంగట్లో సరుకు కాదని, అనేక దశాబ్దాలుగా ఎన్నో తరువాయి 2 వ పేజీలో...



## 'నల్లమల'ను అడ్డుకోవాల్సిందే


**అన్ని ఆధారాలు సిద్ధంగా ఉంచుకోండి**

**న్యాయ నిపుణులతో సీఎం రేవంత్ చర్చలు**

**ప్రాజెక్టుపై నేడు సుప్రీంకోర్టులో విచారణ**

ముంబై: గోదావరిపై ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన పోలవరం నల్లమలసాగర్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సీనియర్ న్యాయ నిపుణులతో చర్చలు జరిపింది. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్ సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వితో ముంబైలోని ఆయన నివాసంలో సమావేశం అయ్యారు. ప్రభుత్వం తరపున సమర్థమైన వాదనలు వినిపించాలని ఈ సందర్భంగా న్యాయ నిపుణులకు సీఎం సూచించారు. అవసరమైన అన్నిఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



జర్మనీలో కొన్నిచోట్ల కుక్కను పెంచుకోవాలనుకుంటే కచ్చితంగా పరీక్ష పాసవ్వాలి. కుక్కను ఎలా చూసుకుంటారు? పబ్లిక్‌లో దానితో ఎలా మసులుకుంటారు? వాటి సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్న ప్రశ్నలతో థియరీ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది.

## ఉరి తీయాల్సింది రాహుల్‌ను

**అశోక్ నగర్ గడ్డపై ఉరేయాలి**

**ప్రజలకు హామీలిచ్చి మాట తప్పారు**

**రేవంత్ టార్గెట్‌గా కేటీఆర్ విసుర్లు**



హైదరాబాద్, జనవరి 4 (ఈవార్తలు): తెలంగాణ జలాల విషయంలో రాష్ట్రానికి కేసీఆర్ అన్యాయం చేసినందుకు ఉరి తీయాలన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతేస్థాయిలో కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్టు రేవంత్ రెడ్డి ప్రవర్తిస్తున్నారనీ, అధికార మదంతో విర్రవీగుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన నాయకుడు కేసీఆర్ అనీ, ఆయనపై అనరాని మాటలు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. కరువు నేలల్లో సిరులు పండించిన, మరణ మృదంగాలు మోగిన చోట జీవకళ తెచ్చిన మానవీయ పరిపాలకుడు కేసీఆర్. అలాంటి వ్యక్తి గురించి రేవంత్ రెడ్డి రెచ్చిపోయి మాట్లాడుతున్నారు. కేసీఆర్‌ను, హరీష్ రావును ఊరివేయాలని అంటున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీని ఎన్నిసార్లు ఊరివేయాలి? ప్రజలు ఎన్ని రకాలుగా శిక్షంచాలి? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి బేసిన్లు కూడా తెలియవు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉంది అని అడిగే వ్యక్తి ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్నారు అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి తరువాయి 2 వ పేజీలో...

## ఉత్తమ్ కట్టుకథలు.. రేవంత్ పిట్టకథలు

**అసెంబ్లీ సాక్షగా కాంగ్రెస్ సర్కారు అబద్ధాలు**

**మాజీ మంత్రి హరీశ్ వెల్లడి.. 'నీళ్ల'పై పీపీటీ**



హైదరాబాద్, జనవరి 4 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు రోజులు శాసనసభను నడిపిన తీరు, శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహార శైలిపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తూ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పిన అబ్ధాలను హరీశ్‌రావు ఎండగట్టారు. కాంగ్రెస్ సర్కారు అసెంబ్లీ సాక్షగా ఏవిధంగా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నదో వివరించారు. హరీశ్‌రావు ఏమన్నారో ఆయన మాటల్లోనే.. 'శాసనసభలో కాంగ్రెస్ పార్టీ తన ద్రోహాలను, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కట్టుకథలను, రేవంత్ రెడ్డి పిట్ట తరువాయి 2 వ పేజీలో...



## బీఆర్ఎస్‌లో హరీశ్ గ్రూప్!

**మరోసారి టార్గెట్ చేసిన కవిత**

**ఒక్క మాటకే అసెంబ్లీని బహిష్కరిస్తారా? అని నిలదీత**

సూర్యాపేట, జనవరి 4 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సూర్యాపేటలో -2 వ పేజీలో...

## రాశి ఫలాలు
5.1.2026

మేషం: దైవ చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. చిన్ననాటి మిత్రులతో ఆనందంగా గడుపుతారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి బంధువులతో విభేదాలు తొలగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల పరిస్థితులు ఉంటాయి.

వృషభం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. మిత్రులతో వివాదాలు కొంత మానసికంగా చికాకు పరుస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు కొంత నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో కష్టించినా ఫలితం కనిపించదు. దాయదులతో స్థిరస్తి వివాదాలు కలుగుతాయి.

మిధునం: చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి మాట పట్టింపులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు పనిచేయదు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కర్కాటకం: భూ క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఒక వ్యవహారంలో ప్రముఖుల నుంచి కీలక సమాచారం అందుతుంది. నూతన వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. విందు వినోద కార్యక్రమాలు ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

సింహం: వృత్తి వ్యాపారాలు మరింత మెరుగైన రీతిలో రాణిస్తాయి. ఉద్యోగస్తులకు నూతన అవకాశాలు లభిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు మంద కోడిగా సాగుతాయి. బంధువుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు హాజరవుతారు. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా సాగుతాయి.

కన్య: విద్యార్థుల శ్రమ ఫలిస్తుంది.చేపట్టిన పనులు వాయిదా పడుతాయి. బంధువర్గంతో వివాదాలు చికాకు పరుస్తాయి. బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

తుల: వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో కొన్ని ఇబ్బందులు తప్పవు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కీలక వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చిన్ననాటి మిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. బందు వర్గంతో వివాదాలు కొంత బాధిస్తాయి.

వృశ్చికం: ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. గృహ వాతావరణం సంతృప్తికరంగా ఉంటుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.

ధనస్సు: ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ పరుస్తుంది. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. సోదరులతో స్థిరస్తి ఒప్పందాలు వాయిదా వేస్తారు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో చిన్నపాటి సమస్యలు తప్పవు. ఒక వ్యవహారంలో సన్నిహితులతో విభేదాలు కలుగుతాయి.

మకరం: వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుతాయి. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

కుంభం: కుటుంబ సభ్యులతో అకారణంగా మాట పట్టింపులు కలుగుతాయి. ఆర్థిక ఇబ్బందులు వలన నూతన రుణాలు చేయవలసి వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు ఆశించిన విధంగా సాగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు.

మీనం: ప్రముఖుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. బంధు వర్గం నుండి శుభవార్తలు అందుతాయి. చేపట్టిన పనుల్లో పురోగతి సాధిస్తారు. విందు వినోద కార్యక్రమాలకు హాజరవుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో మరింత అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది.


# తెలంగాణ.. ఊటీ!

మొదటి పేజీ తరువాయి

తీవ్రత ఎక్కువగా ఉంది. వాతావరణంలోని దిగువ పొరల్లో (భూమికి 0.9 కి.మీ నుండి 1 కి.మీ ఎత్తులో) తేమ ఎక్కువగా పేరుకుపోవడం వల్ల ఈ దట్టమైన పొగమంచు ఏర్పడుతోందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈదురు గాలుల తీవ్రత ఈ నెల 12 వరకు ఉంటుందని తెలిపింది. హైవేలపై ప్రయాణించే వారు వాహనాల ఫాగ్ లైట్లు ఉపయోగించాలని, తక్కువ వేగంతో వెళ్లాలని సూచించింది. ముఖ్యంగా వృద్ధులు, శ్వాసకోస సమస్యలు ఉన్నవారు ఉదయం వేళల్లో బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వెల్లడించింది.

జనం గజగజ

రాష్ట్రంలో రాగల మూడు రోజులు కొన్ని ప్రాంతాల్లో పొగమంచు ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పొగమంచు ప్రభావం తెల్లవారుజామున 3 గంటల నుండి 8 గంటల వరకు కొనసాగుతోందని వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రత 11.1 డిగ్రీలు సంగారెడ్డి జిల్లా కోహిర్ లో నమోదైనట్లు పేర్కొంది. అలాగే రాష్ట్రంలో ఈదురు గాలుల ప్రభావం కారణంగా ఈ నెల 8 వరకు ఆదిలాబాద్, కుమ్రం భీం, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు డిగ్రీల మేర కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగినట్లు వాతావరణ శాఖ తెలిపింది. తూర్పు, ఆగ్నేయ దిశల నుండి తేమ గాలులు ప్రవేశించడం వల్ల దట్టమైన పొగమంచు కమ్మేస్తుందని పేర్కొంది. రాబోయే మూడు రోజులు ఉత్తర గాలులు ప్రారంభమై తెలంగాణ లోని ఉత్తర, మధ్య జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయి చలితీవ్రత పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంది.



# జర.. చెప్పిపోర్రి!

### సంక్రాంతికి ఊరెళ్తే పోలీసులకు చెప్పండి
### హైదరాబాదీలకు సీపీ సజ్జనార్ సూచనలు
### నగదు, బంగారం లాకర్లలోనే దాచుకోవాలని హితవు

హైదరాబాద్, జనవరి 4 (ఈవార్తలు): సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే హైదరాబాదీలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ సూచించారు. పండుగ సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఎక్కువ రోజులు బయటికెళ్లే వారు.. వెళ్లే ముందు తప్పనిసరిగా స్థానిక పోలీసులకు చెప్పి వెళ్లాలన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విటర్) వేదికగా నగరవాసులను అప్రమత్తం చేశారు. పండుగ వేళ చాలామంది కుటుంబ సమేతంగా ఊర్లకు వెళ్తుంటారని, ఇదే అదనుగా భావించి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశముందని సీపీ పేర్కొన్నారు. ప్రయాణానికి ముందే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లోగానీ, బీట్ ఆఫీసర్‌కు గానీ సమాచారం ఇస్తే.. పెట్రోలింగ్‌లో భాగంగా సిబ్బంది ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతారని తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచరాదని సీపీ సజ్జనార్ ప్రజలకు హితవు పలికారు. వాటిని బ్యాంకు లాకర్లలో లేదా ఇతర సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవడం ఉత్తమమని సూచించారు. ఈ చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా చోరీలను నివారించవచ్చని, తద్వారా పండుగను ప్రశాంతంగా జరుపుకోవచ్చని పేర్కొన్నారు. ఆధునిక పోలీసింగ్ అంటే కేవలం నేరాలు జరిగిన తర్వాత స్పందించడం మాత్రమే కాదని, నేరాలను ముందుగానే నివారించడం కూడా అని ఆయన అభిప్రాయపడ్డారు. పండుగ సీజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు, మీ ఇళ్ల భద్రతకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ఇందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. అత్యవసర సమయంలో వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని సీపీ సూచించారు.

# నువ్వు ఎవడివి రా?

మొదటి పేజీ తరువాయి

ఇబ్బందులు ఎదుర్కొని కార్యకర్తలు పార్టీ జెండాను మోశారని జీవన్ రెడ్డి గుర్తుచేశారు. ఎన్నడూ కాంగ్రెస్ కండువా కప్పుకోని వారు, పార్టీ సిద్ధాంతాలు తెలియని వారు ఇప్పుడు పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం సహించరానిదని మండిపడ్డారు. పార్టీ అంతర్గత విషయాల్లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జోక్యం చేసుకుంటే ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో తానే టికెట్లు ఇస్తానని ఎమ్మెల్యే అనడంపై జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ టికెట్లు ఇచ్చే అధికారం ఎవరికి ఉందో పార్టీ అధిష్ఠానానికి తెలుసని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలతోనే అసలు కథ తేలుతుందని వ్యాఖ్యానించారు. జగిత్యాల మున్సిపాలిటీలో 50 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా తాము ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. గతంలో మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధిపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి జీవన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'ప్రభుత్వ విధానాలు నచ్చితే మద్దతు ఇవ్వు, దాన్ని మేము స్వాగతిస్తాం. కానీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాను కదా అని కాంగ్రెస్ పార్టీని తొక్కుతానంటే చూస్తూ ఊరుకోం. నువ్వెవడివిరా మా పార్టీని తొక్కడానికి?' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. గత ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం జీవన్ రెడ్డి వర్గానికి మింగుడు పడటం లేదు. నియోజకవర్గంలో పట్టు కోల్పోతామనే ఆందోళన పాత కాంగ్రెస్ శ్రేణుల్లో కనిపిస్తోంది. మరోవైపు, ఎమ్మెల్యే తన వర్గాన్ని బలోపేతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఆధిపత్య పోరు చివరకు పార్టీ హైకమాండ్ దాకా వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ఈ ఇద్దరు అగ్రనేతల మధ్య సయోధ్య కుదరకపోతే పార్టీకి నష్టం తప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



# బీఆర్ఎస్‌లో హరీశ్ గ్రూప్!

మొదటి పేజీ తరువాయి

ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయంపై హరీశ్ రావును లక్ష్యంగా చేసుకున్నారు. వ్యక్తిగతంగా హరీశ్ రావును ఒక మాట అన్నందుకే అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తారా అని కవిత ప్రశ్నించారు. 'ఆ అంశంపై వాకౌట్ చేసి, మళ్లీ సభకు రావొచ్చు కదా? బీఆర్ఎస్‌లో హరీశ్ ఓ గ్రూపును తయారు చేస్తున్నారు. బయట సభలు పెడుతూ చట్టసభల్లో మాట్లాడే అవకాశాన్ని వదులుకోవడం సరైంది కాదు' అని ఆమె వ్యాఖ్యానించారు. హరీశ్ ధనదాహం కోసమే జూరాల నుంచి శ్రీశైలానికి ప్రాజెక్టును మార్చారని, ఆయన నిర్ణయాలతో సాగునీటి ప్రాజెక్టులకు తీవ్ర నష్టం జరిగిందని ఆరోపించారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత విమర్శలు చేశారు. ప్రతిపక్షం లేని సభలో కృష్ణా జలాలపై ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందన్నారు. గత ప్రభుత్వాన్ని నిందించడంపై ఉన్న శ్రద్ధ, కృష్ణా నీటి వాటాలపై చర్చ జరపడంలో లేదని విమర్శించారు. తెలంగాణకు చిత్తశుద్ధి ఉంటే కర్ణాటక చేపడుతున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదాను రద్దు చేయాలని, ఆల్మట్టి డ్యాం ఎత్తు తగ్గించాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని కవిత డిమాండ్ చేశారు. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నా నీటి సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ఆమె ప్రశ్నించారు.

## ఏప్రిల్‌లో ఇందిరమ్మ 2

మొదటి పేజీ తరువాయి

రెండేళ్లలోనే సుమారు రూ. 70 కోట్లు ఖర్చు చేశామని, మిగిలిన సమస్యలను కూడా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షమాన్ని రెండు కళ్లలా చూస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో హాస్టల్ విద్యార్థులకు చాలీచాలని బువ్వ పెట్టి ఇబ్బంది పెట్టారని... అయితే తమ ప్రభుత్వం మెస్ ఛార్జీలు 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలు 200 శాతం పెంచిందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ ద్వారా ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూస్తున్నా మన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు, పాత కార్డుల్లో కొత్త పేర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేశామని వివరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని... తమ ప్రభుత్వానికి ప్రజల దీవెనలు ఎప్పుడూ ఉండాలని మంత్రి కోరారు.ం

## 'నల్లమల'ను అడ్డుకోవాల్సిందే

మొదటి పేజీ తరువాయి

ఇరిగేషన్ అధికారులను అప్రమత్తం చేశారు. అనుమతులు లేకుండా పోలవరం నుంచి బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు లింక్ చేసేందుకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న విస్తరణ పనులను నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. తక్షణమే పోలవరం ప్రాజెక్టు అథరిటీ ఈ పనులు ఆపేలా సుప్రీంకోర్టు ఆదేశించాలని పలు అంశాలను ప్రస్తావించింది. మొదట్లో ఆమోదించిన మేరకు పోలవరం ప్రాజెక్టు పనుల స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టబద్ధం కావని ఆ పిటిషన్‌లో స్పష్టం చేసింది. తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమలసాగర్ ప్రాజెక్టు ప్రీ-ఫీజిబులిటీ రిపోర్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలించటం సమంజసం కాదని అభ్యంతరం తెలిపింది. అందుకు సంబంధించి కేంద్ర జలసంఘం, కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ, గోదావరి నీటి యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరింది. కేంద్ర జల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం డీపీఆర్ తయారీకి సిద్ధపడుతోందని, వెంటనే ఈ చర్యలను ఆపాలని కోరింది. ఏపీ తలపెడుతున్న ఈ విస్తరణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా, కేంద్రం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందించకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొంది.

## ఉరి తీయాల్సింది రాహుల్‌ను

మొదటి పేజీ తరువాయి

సమైక్యవాదుల బూట్లు పాలిష్ చేసిన వ్యక్తని, తెలంగాణ ఉద్యమంలో కోట్లాడినవారి త్యాగాలను అవమానిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఎన్టీఆర్ గారు అన్న అంగుష్ఠ మాత్రులు అనే పదం రేవంత్ రెడ్డికి పూర్తిగా అర్థమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 65 ఏళ్లు, చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని టీడీపీ 17 ఏళ్లు తెలంగాణకు జలాల అంశంలో ద్రోహం చేశాయి. దానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్‌దే అని విమర్శించారు. ఉరిశిక్షల గురించి మాట్లాడుతున్న రేవంత్‌ను, రాహుల్ గాంధీని ఎందుకు ఉరితీయకూడదని కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. అశోక్ నగర్‌లో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని, బీసీలకు 42% రిజర్వేషన్ ఇస్తామని చెప్పి మాట తప్పినందుకు రాహుల్ గాంధీని, రేవంత్‌ను ఉరితీయాలి. అన్ని రంగాల్లో అట్టర్ ఫ్లాప్ అయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రేవంత్ అధినేత అని ధ్వజమెత్తారు.

# ఉత్తమ్ కట్టుకథలు.. రేవంత్ పిట్టకథలు

మొదటి పేజీ తరువాయి

కథలను చెప్పే ప్రయత్నం చేశారు. పూర్తిగా అబద్ధాలు చెప్పారు. తెలంగాణకు బీఆర్ఎస్ ఏదో అన్యాయం చేసినట్లు తప్పుడు ప్రచారం చేశారు. అసలు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టిందే కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని, మోసాన్ని సరిదిద్ది తెలంగాణకు శాశ్వత నీటి హక్కులు పొందే విధంగా ప్రాజెక్టులు నిర్మించి ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది' అని చెప్పారు. 'కాంగ్రెస్ చేసిన ద్రోహాలను, తప్పులను, శనివారం వారు శాసనసభలో చెప్పిన అబద్ధాలను, తెలంగాణ నీటి హక్కులను కాపాడటానికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి చేసిన కృషిని నేను నా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వెల్లడిస్తా. ఈ పవర్ పాయింట్ ప్రజంటేషన్ రాజకీయాల కోసం కాదు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం నేను ఈ పీపీటీని మీ ముందు పెడుతున్నా. నేడు రాజకీయాలు అంటే పదవులు అన్నట్టుగా మారింది. కానీ మేం పదవులు కోసం పనిచేయట్లేదు. మాకు పదవులు శాశ్వతం కాదు, రాష్ట్రం, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే శాశ్వతం' అని అన్నారు.

కేసీఆర్ అన్యాయం చేస్తడా?

తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేసీఆర్ ఉదాసీనత వల్ల తెలంగాణ అన్యాయం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించడంపై హరీశ్‌రావు మండిపడ్డారు. నీటి వాటాలో కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేసిండంటే ఎవరూ నమ్మరని అన్నారు. 'నీటి పంపకాల కోసం సెక్షన్-3 ప్రకారం ట్రిబ్యునల్ వేయాలని బీఆర్ఎస్ హయంలో నాటి సీఎం కేసీఆర్ కేంద్రానికి 32 లేఖలు రాశారు. ప్రధానమంత్రికి లేఖలు రాశారు. ఫస్ట్ అఫెక్స్ కౌన్సిల్‌లో మాట్లాడారు. సెకండ్ అఫెక్స్ కౌన్సిల్‌లో మాట్లాడారు. చివరికి సుప్రీంకోర్టుకు వెళ్లి సెక్షన్-3 సాధించారు. నాడు కేసీఆర్ తెలంగాణ కోసం కొట్లాడి ఎంత మేలు చేసిండ్రో.. ఆ తర్వాత సెక్షన్-3 సాధించి కూడా అంతే మేలు చేశారు. సెక్షన్-3 సాధించడం వల్లనే కదా ఇయ్యాల మనం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించగలుగుతున్నాం' అని అన్నారు. 'తన ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ కోసం కొట్లాడిన కేసీఆర్ మీద ఇయ్యాల అధికార కాంగ్రెస్ నేతలు నోటికొచ్చిన ఆరోపణలు చేస్తున్నరు. తెలంగాణ రావాల్సిన నీళ్ల వాటా విషయంలో కొట్లాడకుండా అన్యాయం చేసిండని మాట్లాడుతున్నరు. ప్రాణాలకు తెగించి కొట్లాడి స్వరాష్ట్రం సాధించిన కేసీఆర్.. తెలంగాణకు నీళ్లలో అన్యాయం చేస్తడంటే ఎవరూ నమ్మరు. సెక్షన్-3 కోసం అప్పటి తెలంగాణ సర్కారు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దాంతో కేంద్రం దిగివచ్చింది. సుప్రీంకోర్టులో పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకుంటే వెంటనే ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. దాంతో రాష్ట్రం పిటిషన్‌ను ఉపసంహరించుకుంది' అని చెప్పారు. 'ఇక్కడ బీజేపీ గురించి కూడా రెండు మాటలు చెప్పుకోవాలి. సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరించుకుంటే వెంటనే ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామన్న బీజేపీ నేతృత్వంలోని కేంద్రం.. మాటతప్పింది. మనం 2021 అక్టోబర్ 6న పిటిషన్‌ను ఉపసంహరించుకుంటే.. వెంటనే ట్రిబ్యునల్ వేయకుండా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం సరిగ్గా రెండేళ్ల తర్వాత.. అంటే 2023 అక్టోబర్ 6న సెక్షన్-3 అమలుకు ఆమోదం తెలుపుతూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అంటే ఏకంగా రెండేళ్లు తాత్సారం చేసింది' అని అన్నారు. 'కేసీఆర్‌ను ఉరి తియ్యాలి అని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నడు. కేసీఆర్‌ను తీయడం కాదు, అసెంబ్లీలో అబద్ధాలు మాట్లాడి శాసనసభ వ్యవస్థను తప్పుదారి పట్టించిన రేవంత్‌రెడ్డి నాలుక కొయ్యాలె' అని హరీశ్‌రావు మండిపడ్డారు.



# వెయ్యేళ్ల విశ్వాసం.. సోమనాథ్

సోమనాథ్.. ఈ పదం చెవినబడగానే మన హృదయాంతరాళం పులకాంకితమై, మదిలో సగర్వ భావన మెదలుతుంది. ఇది భారతీయాత్మ అనంత స్పందన. ఈ అద్భుత ఆలయం పశ్చిమ భారత తీరంలోని గుజరాత్ రాష్ట్రం ప్రభాస్ పటాన్ అనే ప్రదేశాన్ని పావనం చేస్తోంది. దేశంలోని 12 జ్యోతిర్లింగాల ప్రాశస్త్యాన్ని 'ద్వాదశ జ్యోతిర్లింగ' స్తోత్రం ప్రస్తుతిస్తుంది. "సౌరాష్ట్రే సోమనాథం చ..." అంటూ ఆరంభమయ్యే ఈ స్తోత్రం, తొలి జ్యోతిర్లింగ నెలవుగా సోమనాథ్ నాగరికత, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తుంది. అంతేకాకుండా.. ఈ శ్లోకం జ్యోతిర్లింగ మహత్తును ఇలా చాటిచెబుతుంది.

**సోమలింగం నరో దృష్ట్వా సర్వపాపైః ప్రముచ్యతే**
**లభతే ఫలం మనోవాంఛితం మృతః స్వర్గం సమాశ్రయేత్**

అంటే– "సోమనాథ్ శివలింగ దర్శన మాత్రాన జీవుడు పాప విముక్తుడై సదాశయాలను నెరవేర్చి, మరణానంతరం స్వర్గ ప్రాప్తినొందుతాడు" అని అర్థం. కానీ, లక్షలాది భక్తజనం భక్తిప్రపత్తులతో నీరాజనాలు అర్పించిన ఈ సోమనాథ్‌పై దురదృష్టవశాత్తూ విధ్వంసమే ఏకైక ధ్యేయంగా విదేశీ దురాక్రమణదారులు దండయాత్రలు చేశారు. ఈ నేపథ్యంలో సోమనాథ ఆలయానికి 2026 సంవత్సరం ప్రత్యేకమైనది. ఈ ఐతిహాసిక పుణ్యక్షేత్రంపై తొలి దాడికి ఈ ఏడాదిలో వెయ్యేళ్లు పూర్తవుతున్నాయి. గజనీ మహమ్మద్ 1026 జనవరిలో క్రూర, హింసాత్మక దండయాత్రలో భాగంగా ఈ ఆలయంపై దాడి చేశాడు. ప్రజల భక్తివిశ్వాసాలకు, నాగరికతకు సుసంపన్న ప్రతీక అయిన ఈ ఆలయాన్ని ధ్వంసం చేయాలని చూశాడు. అయితే, సోమనాథ్‌కు పూర్వ వైభవం దిశగా ఏళ్లపాటు సాగిన అవిరళ కృషి ఫలితంగా వెయ్యేళ్ల తర్వాత కూడా ఈ ఆలయ దివ్య దీప్తి ప్రపంచవ్యాప్తంగా ప్రకాశిస్తోంది. ఇటువంటి ప్రయత్నాల్లో ఒక ఘట్టానికి 2026లో 75 సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ మేరకు ఆలయ పునరుద్ధరణ అనంతరం 1951 మే 11వ తేదీన అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సమక్షన నిర్వహించిన కార్యక్రమంలో భక్తులకు జ్యోతిర్లింగ భాగ్యం కల్పిస్తూ ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. సోమనాథ్‌పై వెయ్యేళ్ల నాటి తొలి దండయాత్ర, అక్కడి దురాక్రమణదారుల క్రూరత్వం, పుణ్యక్షేత్ర విధ్వంసం వంటి అమానుష ఘట్టాలను వివిధ చారిత్రక గ్రంథలు సవివరంగా నమోదు చేశాయి. వాటిని చదివే ప్రతి పాఠకుడి గుండె విలవిలలాడుతూ లిప్తపాటు విచలితమవుతుంది. ప్రతి పంక్తిలోనూ బట్టబయలయ్యే హింస, క్రూరత్వం వెయ్యేళ్లు గడిచినా మరపురాని విషాద భారాన్ని మన మనోఫలకంపై మోపుతాయి. భారత దేశంపైన, ప్రజల మనోధైర్యం మీద అది చూపిన పెను దుష్ప్రభావాన్ని ఒకసారి ఊహించండి. సముద్ర తీరంలోగల సోమనాథ్ ఆలయం అమేయ ఆర్థిక శక్తితో సమాజానికి సాధికారతనిచ్చింది. అన్నింటినీ మించి సోమనాథ్‌కు విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. నాటి సమాజంలోని సముద్ర వ్యాపారులు, నావికులు సోమనాథ్ వైభవ గాథలను దేశదేశాలకు విస్తృతంగా మోసుకెళ్లారు.

అయినప్పటికీ, తొలి దాడికి సహస్రాబ్ది పూర్తయ్యాక కూడా సోమనాథ్ గాథ విధ్వంస నిర్వచనంగా నిలవకపోవడంపై నిస్సందేహంగా నేనెంతో గర్విస్తున్నాను. ఈ ఆలయం ఈనాడు భరతమాత కోట్లాది బిడ్డల అఖండ ధైర్యానికి నిర్వచనంగా నిలుస్తోంది. ఎన్నడో వెయ్యేళ్ల కిందట 1026లో మొదలైన మధ్యయుగపు అనాగరిక దండయాత్ర, ఇతరులను కూడా సోమనాథ్‌పై పదేపదే దాడులకు 'ప్రేరేపించింది.' దేశ ప్రజలను, సంస్కృతిని దాస్య శృంఖలాల్లో బంధించే ప్రయత్నాలకు నాంది పలికింది. కానీ, ఆలయంపై దాడి జరిగిన ప్రతి సందర్భంలోనూ రక్షణ కుడ్యంలా నిలిచి, ఆత్మార్పణకూ వెరవని వీరపుత్రులు, పుత్రికలు ఎందరో ఉన్నారు. దాడి జరిగిన ప్రతిసారి మనదైన గొప్ప నాగరికతకు వారసులుగా వారు పుంజుకుంటూ తరతరాలుగా ఆలయ పునర్నిర్మాణం, పునరుజ్జీవనానికి పాటుపడుతూనే వచ్చారు. ఇటువంటి మహనీయులలో అహల్యాబాయి హోల్కర్ ప్రముఖులు. సోమ్‌నాథ్‌లో భక్తులు ప్రార్థనలు చేసుకునేలా ఆమె అందించిన అవిరళ కృషి వెలకట్టలేనిది. అటువంటి మహానుభావులు జీవించిన నేలపై నడయాడగలగటం నిజంగా మన అదృష్టం. స్వామి వివేకానంద 1890 దశకంలో సోమనాథ్‌ను సందర్శించినపుడు అనిర్వచనీయ అనుభూతికి లోనయ్యారు. నాటి తన అనుభవాన్ని 1897లో చెన్నై నగరంలో ఓ కార్యక్రమం సందర్భంగా– "దక్షిణ భారతంలోని ప్రాచీన ఆలయాలతోపాటు గుజరాత్‌లోని సోమనాథ్ వంటివి మనకు అపార జ్ఞానప్రదాతలు. ఎన్నో పుస్తకాలు వివరించలేని జాతి చరిత్రపై మనకు మరింత లోతైన అవగాహనను అందిస్తాయి. వంద దాడులను భరించిన గుర్తులతోనే కాకుండా వంద పునరుజ్జీవన చిహ్నాలతో ఈ ఆలయాలు ఎంత వైభవంగా నిలిచాయో గమనించండి. నిరంతర విధ్వంసం, శిథిలాల నుంచి నిరంతర పునరుజ్జీవనంతో మునుపటి ఠీవితో ఎంత శక్తిమంతంగా విలసిల్లుతున్నాయో చూడండి! అదే జాతీయ మనోభావన.. జాతీయ జీవన స్రవంతి. అనుసరిస్తే అది అమేయ యశస్సు వైపు మనల్ని నడిపిస్తుంది. ఆ జీవన స్రవంతిని వీడితే ఫలితం మరణమే! ఆ మార్గం వదిలిపెడితే ప్రభావం ఆత్మనాశనం, వినాశమే!" స్వాతంత్ర్యానంతరం సమర్థుడైన ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సోమనాథ ఆలయ పునర్నిర్మాణ పవిత్ర బాధ్యతను స్వీకరించారు. 1947లో దీపావళి వేళ ఆ ప్రాంతంలో ఆయన పర్యటించారు. అక్కడి పరిస్థితులను చూసి చలించిపోయిన సర్దార్ పటేల్.. అక్కడే ఆలయాన్ని పునర్నిర్మిస్తామని ప్రకటించారు. చివరికి 1951 మే 11న సోమనాథ్‌లో భవ్యమైన ఆలయ ద్వారాలు భక్తుల కోసం తెరచుకున్నాయి. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆ వేడుకకు హాజరయ్యారు. ఈ చారిత్రక ఘట్టాన్ని వీక్షంచాలని కలలుగన్న యోధుడు సర్దార్ సాహెబ్ ఆ సమయానికి భౌతికంగా ఈ లోకంలో లేరు. కానీ, ఆయన స్వప్నం సాకారమై దేశం ఎదుట సగర్వంగా నిలిచింది. నాటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఈ పరిణామం పట్ల అంతగా ఉత్సాహం చూపలేదు. ఎంతో విశిష్టమైన ఈ కార్యక్రమంలో గౌరవ రాష్ట్రపతి, మంత్రులు పాల్గొనడం ఆయనకు ఇష్టం లేదు. ఈ కార్యక్రమం భారత్‌పై ప్రతికూల ముద్ర వేసిందని నెహ్రూ వ్యాఖ్యానించారు. కానీ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తన నిర్ణయానికి దృఢంగా కట్టుబడి ఉన్నారు. అనంతర పరిణామాలు చరిత్ర పుటల్లో నిలిచే ఉన్నాయి. సర్దార్ పటేల్‌కు ఎంతో అండగా నిలిచిన కేఎం మున్షీని స్మరించుకోకపోతే సోమనాథ్ గాథ అసంపూర్ణమే అవుతుంది. 'సోమనాథ: నిత్య క్షత్రం (సోమనాథ: ది ష్రైన్ ఎటర్నల్)' గ్రంథంతోపాటు.. సోమనాథ్‌పై ఎన్నో సమాచారభరిత, విజ్ఞానదాయకమైన రచనలు చేశారు. నిజానికి, మున్షీ తన గ్రంథ శీర్షికలో చెప్పినట్టు.. ఆత్మ నిత్యత్వాన్నీ, ఉన్నత భావాల శాశ్వతత్వాన్నీ బలంగా విశ్వసించే గొప్ప నాగరికత మనది. 'నైనం ఛిందన్తి శస్త్రాని' అని గీతలో చెప్పినట్టు ఉ అది ధ్వంసం చేయ శక్యంగాని అజరామరత్వమని మనం బలంగా నమ్ముతాం. మన నాగరికత అజేయ స్ఫూర్తికి సోమనాథ్‌ను మించిన ఉదాహరణ మరొకటి లేదు. ఎన్నో అవరోధాలనూ, ఆటుపోట్లనూ ఎదుర్కొని వైభవోపేతంగా నిలిచిన సోమనాథ్ కన్నా మిన్నగా మరేది దీన్ని వివరించగలదు? వందల ఏళ్ల దాడులనూ, వలసవాద దోపిడీనీ తట్టుకొని నిలబడి.. నేడు ప్రపంచ వృద్ధిలో అత్యంత ఆశాజనకమైన దేశంగా ఎదిగిన భారత ప్రగతిలోనూ ఇదే స్ఫూర్తి తొణికిసలాడుతోంది. నేడు భారత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందంటే.. మన విలువలు, భారతీయుల దృఢ సంకల్పమే దానికి మూలం. ప్రపంచం ఆశతో, ఆశాభావంతో భారత్‌ను చూస్తోంది. సృజనాత్మకత నిండిన మన యువతపై విశ్వాసంతో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతోంది. మన కళ, సంస్కృతి, సంగీతం, పండుగలు ఇప్పుడు విశ్వవ్యాప్తమవుతున్నాయి. యోగా, ఆయుర్వేదం ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తున్నాయి. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న కొన్ని అత్యంత తీవ్రమైన సవాళ్లకు భారత్ పరిష్కారాలను చూపుతోంది. అనాది కాలం నుంచి వివిధ వర్గాల ప్రజలను సోమనాథ్ ఏకం చేస్తోంది. శతాబ్దాల కిందటే పూజ్య జైన సన్యాసి కలికాల సర్వజ్ఞ హేమచంద్రాచార్యులు సోమనాథ్‌కు వచ్చారు. అక్కడ ప్రార్థన అనంతరం.. 'భవబీజాంకురజననా రాగాధ్యాః క్షయముపగతా యస్య' అనే శ్లోకాన్ని ఆయన చెప్పాడంటారు. అంటే – 'లౌకిక కర్మ బీజాలను నశింపజేసే వాడికీ.. రాగద్వేషాలనూ, సమస్త క్లేశాలనూ తుడిచిపెట్టే వాడికీ వందనాలు' అని అర్థం. నేడు మన మనస్సులోనూ, ఆత్మలోనూ ఒక బలమైన చైతన్యాన్ని రగిలించే అద్భుత శక్తి సోమనాథ్‌కు ఉంది. 1026లో మొదటిసారి దాడి జరిగి వెయ్యేళ్లు గడిచినా.. సోమనాథ్ వద్ద సాగరం నేటికీ అంతే గంభీరంగా గర్జిస్తోంది. సోమనాథ్ తీరాన్ని తాకే అలలు అద్భుతమైన కథను చెబుతున్నాయి. ఆటంకాలెన్నెదురైనా.. ఆ అలల మాదిరిగానే మళ్లీ సోమనాథ అభ్యుదయం తథ్యం. నాటి దురాక్రమణదారులు నేడు గాలిలో కలిసిన ధూళి కణాలయ్యారు. వారి పేర్లు విధ్వంసానికి పర్యాయపదాలుగా మిగిలాయి. వారంతా చరిత్ర గ్రంథల్లో పాదసూచికలు మాత్రమే. సోమనాథ్ మాత్రం దిగంతాలకు అతీతంగా దేదీప్యమై వెలుగులు విరజిమ్ముతోంది. 1026 నాటి దాడితో ఏమాత్రమూ చెక్కుచెదరని ఆ అజేయమైన, చిరతరమైన స్ఫూర్తిని మనకు గుర్తు చేస్తూనే ఉంటుంది. సోమనాథ్ ఒక ఆశా గీతం. ద్వేషం, మతోన్మాదాలకు తాత్కాలికంగా ధ్వంసం చేసే శక్తి ఉండవచ్చు. కానీ సత్యమూ, ధర్మంపై అచంచలమైన విశ్వాసమూ అమరత్వాన్ని సృజించగలవని సోమనాథ్ చాటుతోంది. వెయ్యేళ్ల కిందట దాడికి గురై, తర్వాత కూడా నిరంతర దాడులను ఎదుర్కొన్న సోమనాథ ఆలయం మళ్లీ మళ్లీ సగర్వంగా నిలిచినట్టే.. మనం కూడా పరాయి దండయాత్రలకు ముందున్న, వెయ్యేళ్ల కిందటి మన దేశ మహా వైభవాన్ని పునరుద్ధరించుకుని తీరుతాం. శ్రీ సోమనాథ మహాదేవుడి ఆశీస్సులతో, వికసిత భారత నవ సంకల్పంతో మనం ముందుకు సాగుతున్నాం. విశ్వకల్యాణమే పరమావధిగా.. మన నాగరికతా స్ఫూర్తి దిశానిర్దేశం చేస్తోంది.







**- నరేంద్ర మోదీ**
**ప్రధానమంత్రి, సోమనాథ్ ట్రస్టు చైర్మన్**

**జై సోమనాథ్!**



## ఘోస్ట్ సిమ్‌లతో సంభాషణ

**ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లతో రాయబారాలు**

**ఢిల్లీ పేలుళ్ల కేసులో ఆసక్తికర అంశాలు**

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎర్రకోట సమీపంలో గతేడాది జరిగిన కారు బాంబు పేలుడు కేసు దర్యాప్తులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కీలక విషయాలు వెలుగులోకి తెచ్చింది. ఈ కేసులో అరెస్టయిన వైట్ కాలర్ ఉగ్రవాదులు.. పాకిస్థాన్‌లోని తమ హ్యాండ్లర్లతో మాట్లాడేందుకు ఘోస్ట్ సిమ్ కార్డులు, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను వాడినట్లు తేలింది. విచారణలో నిందితులైన వైద్యులు డ్యూయల్ ఫోన్ విధానాన్ని అనుసరించినట్లు ఎన్ఐఏ గుర్తించింది. ఒక ఫోన్‌ను తమ వ్యక్తిగత, వృత్తిపరమైన అవసరాలకు వాడుతూ, రెండో ఫోన్‌ను కేవలం ఉగ్ర కార్యకలాపాలకే పరిమితం చేశారు. ఈ టెర్రర్ ఫోన్‌లో వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌లోని ఉకాసా, ఫైజాన్, హష్మీ అనే కోడ్ నేమ్స్ ఉన్న హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరిపారు. నకిలీ లేదా ఇతరుల ఆధార్ వివరాలతో తీసుకున్న సిమ్‌లనే ఘోస్ట్ సిమ్‌లుగా పిలుస్తున్నారు. ఈ సిమ్ కార్డు ఫోన్‌లో లేకపోయినా ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లు పనిచేసేలా ఈ టెక్నాలజీని వాడుకున్నారు. దీనివల్ల వీరిని ట్రేస్ చేయడం కష్టంగా మారింది. హ్యాండ్లర్ల నుంచి యూట్యూబ్ ద్వారా ఐఈడీల తయారీ నేర్చుకుని దేశంలో దాడులకు ప్లాన్ చేసినట్లు తేలింది. ఈ ఉగ్ర కుట్ర వెలుగులోకి రావడంతోనే కేంద్ర టెలికమ్యూనికేషన్ల విభాగం (డాట్) గతేడాది నవంబర్‌లో కీలక నిబంధనలు తీసుకొచ్చింది. వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్ వంటి యాప్‌లు ఇకపై ఫిజికల్ సిమ్ కార్డు డివైజ్‌లో ఉంటేనే పనిచేసేలా చట్టం చేసింది. ఒకవేళ సిమ్ తీసేస్తే లేదా ఫోన్ మార్చితే ఆటోమేటిక్‌గా లాగౌట్ అయ్యేలా నిబంధనలు అమలులోకి వచ్చాయి. గతేడాది నవంబర్ 10న జరిగిన ఈ పేలుడులో పలువురు ప్రాణాలు కోల్పోగా, ఎన్ఐఏ విచారణను మరింత ముమ్మరం చేసింది.

# అమెరికా ఆర్థిక నియంతృత్వం

అమెరికా, వెనిజులా మధ్య ఉన్న రాజకీయ సంఘర్షణ మరింత తీవ్రమైంది. స్వల్పకాల యుద్ధ చర్యలలో భాగంగా అమెరికా ప్రత్యేక దళాలు వెనిజులాలోని రాజధాని కరాకాస్‌లో శ్రీ నికోలాస్ మదురోను ,ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ని నిర్బంధించి తరువాత అమెరికా భూభాగానికి తీసుకువచ్చినట్టు అధికారులు ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఆపరేషన్‌లో మదురోను సంప్రదాయ ప్రఖ్యాత నైరేజ్య నేరవారి, నార్కోటెర్రర్రిరిచర్చులో నడిపిన ఆరోపణల మేరకు న్యూయార్క్‌లో నేరాలపై శిక్షంచడానికి తీసుకువచ్చారు.అమెరికా ప్రత్యేక దళాలు స్వల్ప కాలంలో చేసిన ఈ ఉద్యమాన్ని ట్రంప్ ప్రభుత్వం 'ఆపరేషన్ అబ్జల్యూట్ రిసాల్వ్ అని పిలుస్తున్నారు. వీరు రాత్రి సమయంలో వేగంగా చర్యలు తీసుకుని మదురోను పట్టుకొని ముందుగా సముద్ర యుద్ధ నౌకలోకి తీసుకొని, అక్కడి నుంచి న్యూయార్క్‌కు తరలించారు.ట్రంప్ తన ట్రూత్ సోషల్‌మీడియా లో పోస్ట్ చేశారు,వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సి రోడ్రిగ్విజ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేశారని అధికారులు తెలిపారు. అమెరికా ఒక తాత్కాలిక పరిపాలన ఏర్పాటు చేసి, వెనిజులా ప్రభుత్వంలో సురక్షతమైన, ప్రజాస్వామిక మార్పు కోసం చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. అమెరికా , వెనిజులా మధ్య ఉద్రిక్తతలు చర్చనీయాంశంగా మారాయి. వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురో పాలన ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ అమెరికా ఇప్పటికే విధించిన ఆర్థిక ఆంక్షలను కొనసాగిస్తోంది. వెనిజులాలో ఇటీవల జరిగిన ఎన్నికలపై పారదర్శకత లేదని అమెరికా ఆరోపించింది. మానవ హక్కుల ఉల్లంఘనలు, రాజకీయ ప్రత్యర్థులపై అణచివేత ఇది ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పరిరక్షణ కోసం తీసుకున్న చర్యలు మదురో ప్రభుత్వం అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని వాదిస్తోందికొనసాగుతోందని పేర్కొంటూ మదురో ప్రభుత్వాన్ని గుర్తించబోమని వాషింగ్టన్ మరోసారి స్పష్టం చేసింది. అమెరికా ప్రభుత్వం చెబుతోంది మదురో తన పాలనలో డ్రగ్ నెట్వర్క్‌లు, నార్కోఉ టెర్రిజం అంశాలకి మద్దతు ఇవ్వడం వల్ల అమెరికాలోకూ తీవ్ర నష్టాలు కలిగిస్తోందని. దీనిని పునఃపరిశీలించి, వాషింగ్టన్ వారు అతన్ని అరెస్ట్ చేసి న్యాయపరమైన చర్యలకు లోబెడుతున్నారు. అమెరికా మిత్రదేశాలు మదురో పాలనపై మరింత ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. దీంతో ఈ సమస్య కేవలం రెండు దేశాల మధ్యకే కాకుండా అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక అంశంగా మారింది.పరిస్థితి ఇలాగే కొనసాగితే వెనిజులా ప్రజలపై ప్రభావం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దౌత్య చర్చల ద్వారానే ఈ సంక్షోభానికి పరిష్కారం సాధ్యమని అంతర్జాతీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆహార కొరత కారణంగా లక్షలాది మంది వెనిజులా పౌరులు పొరుగు దేశాలకు వలస వెళ్తున్నారు. ఈ పరిస్థితి లాటిన్ అమెరికా ప్రాంతంలో మానవతా సంక్షభంగా మారుతోందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. దీనికి ప్రతిగా, అమెరికా వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందని మదురో ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. అమెరికా విధించిన చమురు, బ్యాంకింగ్ రంగ ఆంక్షల వల్ల వెనిజులా ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ఈ వివాదంలో రష్యా, చైనా, ఇరాన్ వంటి దేశాలు వెనిజులాకు మద్దతు ప్రకటించాయి.





**- జేడీ కుమార్, బీఏ,**
**ఎల్ఎల్‌బీ (అడ్వొకేట్)**

### ఖనిజాలు, చమురు జాతీయీకరణ

వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు ప్రధాన కారణం వెనెజులాలోని చమురు, ఖనిజ వనరుల జాతీయీకరణ. మదురో ప్రభుత్వం చమురు, బంగారం, కోల్టాన్ వంటి వనరులను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉంచింది. ఇది అమెరికా, పశ్చిమ దేశాల కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా మారింది. అమెరికా ఆర్థిక ఆంక్షలు ట్రంప్ పాలనలో వెనెజులాపై కఠినమైన ఆర్థిక ఆంక్షలు విధించబడ్డాయి. వెనెజులా విదేశీ ఆస్తుల ఫ్రీజ్డాలర్ లావాదేవీలపై పరిమితులువీటి వల్ల వెనెజులా ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నది. అమెరికా మదురో ప్రభుత్వాన్ని చట్టబద్ధం కాదని ప్రకటించి, ప్రతిపక్ష నేతలకు (వనరులను విదేశీ కంపెనీలకు తెరిచి పెడతామని చెప్పిన వర్గాలకు) మద్దతు ఇచ్చింది. ఈ చర్యలన్నీ కలిసి చూస్తే, ఆర్థిక ఒత్తిడి ద్వారా ప్రభుత్వాన్ని మార్చాలనే ప్రయత్నం చేసినట్లే. వెనెజులా ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు కలిగిన దేశాల్లో ఒకటిగా ఉండగా మదురో ప్రభుత్వం ఈ చమురు వనరులతో పాటు బంగారం, ఇనుము, కోల్టాన్ వంటి కీలక ఖనిజాలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే విధానాన్ని అమలు చేసింది. దీనివల్ల అమెరికా, పశ్చిమ దేశాలకు చెందిన బహుళజాతి కంపెనీల ప్రయోజనాలు దెబ్బతిన్నాయి. ఈ జాతీయీకరణ విధానాన్ని మదురో ప్రభుత్వం దేశ ఆర్థిక స్వావలంబన, ప్రజా సంక్షమం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేక పోరాటంగా అభివర్ణిస్తే, అమెరికా మాత్రం దీనిని ప్రైవేట్ పెట్టుబడులకు వ్యతిరేకం, ప్రజాస్వామ్య విరుద్ధంగా విమర్శించింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ పరిపాలన వెనెజులాపై కఠిన ఆర్థిక ఆంక్షలు, చమురు ఎగుమతులపై నియంత్రణలు విధించబడ్డాయి.

మదురో ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నంగా అమెరికా ప్రతిపక్ష నాయకుడు జువాన్ గ్వైడోకు మద్దతు ఇవ్వడం ద్వారా ఈ ఘర్షణ మరింత తీవ్రమైంది. అయితే మదురో ప్రభుత్వం మాత్రం దేశ సహజ వనరులపై విదేశీ ఆధిపత్యాన్ని అంగీకరించబోమని, జాతీయీకరణ విధానాన్ని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. మాధురో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న విపక్షంలో అతిపెద్ద నేతగా మాచాడో వ్యవస్థలో పెట్టుబడులను ఓపికగా తెరవడం వల్ల తమ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయగలమని వాదించింది. దీని ద్వారా విదేశీ పెట్టుబడులు, ముఖ్యంగా అమెరికన్ కంపెనీలు కూడా చేరవచ్చు అని మాట్లాడారు. ఇది అమెరికా వంటి విదేశీ కంపెనీలను వెనెజులాలో పనిచేయడానికి అవకాశం కల్పించవచ్చు అన్న అభిప్రాయంతో పాటు, దేశ ఆర్థిక విలువను పెద్దగా పెంచే అవకాశాలుగా ఆమె చెప్పింది. మదురో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న విపక్షంలో నేత కోరినా మాచాడో 2025లో నోబెల్ శాంతి బహుమతి కూడా గెలుచుకుంది. అమెరికాఉవెనెజులా ఘర్షణ ప్రధానంగా ఆర్థిక ప్రయోజనాల చుట్టూ తిరుగుతోంది. వెనెజులా సహజ వనరులపై నియంత్రణ కోసం సాగుతున్న అమెరికా–వెనెజులా ఆర్థిక పోరాటమే అని చెప్పవచ్చు.

### సత్యసాయిబాబాతో మదురోకు అనుబంధం!

వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పుట్టపర్తితో ఉన్న ఆధ్యాత్మిక అనుబంధం గొప్పది. ముఖ్యంగా భగవాన్ శ్రీ సత్యసాయి బాబాతో మదురో కుటుంబానికి ఉన్న సంబంధంపై గత కొన్నేళ్లుగా పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువడుతున్నాయి.మదురో భార్య సిలియా ఫ్లోరెస్ ముందుగా సత్యసాయి బాబా బోధనల పట్ల ఆకర్షితురాలై, ఆయన ఆధ్యాత్మిక సిద్ధాంతాల ప్రభావానికి లోనైందని సమాచారం. గమనార్హమైన విషయం ఏమిటంటే, సిలియా ఫ్లోరెస్ కేవలం మదురో భార్య మాత్రమే కాకుండా, వెనెజులాలో ప్రముఖ రాజకీయ నాయకురాలు. ఆమె వెనెజులా నేషనల్ అసెంబ్లీ మాజీ అధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం కలిగి ఉండటంతో పాటు, దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న వ్యక్తిగా గుర్తింపు పొందారు. సిలియా ఫ్లోరెస్ ద్వారా నికోలస్ మదురో కూడా సత్యసాయి బాబా బోధనలైన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస పట్ల ఆసక్తి కనబరిచినట్లు చెబుతారు. వివాహానంతరం మదురో ఆధ్యాత్మిక అంశాల వైపు మరింత దృష్టి పెట్టినట్టు అంతర్జాతీయ మీడియా పేర్కొంది.ఈ నేపథ్యంలో, మదురో తన రాజకీయ జీవితం ప్రారంభ దశలో భారతదేశాన్ని సందర్శించినపుడు పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం ఆశ్రమాన్ని దర్శించి, సత్యసాయి బాబా ఆశీర్వాదాలు తీసుకున్నారని వార్తలు వచ్చాయి. ఆ సందర్శన సమయంలో ఆయన సాయి బాబా బోధనలను లోతుగా తెలుసుకునే ప్రయత్నం చేసినట్టు కూడా కొన్ని నివేదికలు వెల్లడించాయి. ఒక దశలో మదురో తన కార్యాలయంలో సత్యసాయి బాబా ఫోటోను ఉంచుకున్నారని కూడా కథనాలు వెలువడ్డాయి.



## పుస్తె మట్టెలు విశ్వబ్రాహ్మణులకే ఇవ్వాలి

**సీఎం రేవంత్‌కు మక్కాన్ సింగ్ వినతి**

హైదరాబాద్, జనవరి 4 (ఈవార్తలు): విశ్వ బ్రాహ్మణుల అభ్యున్నతికి విశ్వ బ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, స్వర్ణకారుల సమస్యలకు పరిష్కారం చూపాలని పెద్దపల్లి జిల్లా ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణ రావు , రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్.. సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఆదివారం సీఎంను కలిసిన వారిద్దరు.. 50 ఏళ్లు పైబడిన విశ్వ బ్రాహ్మణులకు పెన్షన్ మంజూరు చేయాలని, వివాహాలలో పుస్తె మట్టెలు చేసే హక్కులను స్వర్ణకారులకే కల్పించాలని కోరారు. అంతేకాకుండా జ్యువెలరీ షాపుల్లో పుస్తె మట్టెల అమ్మకాలను నిషేధించేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని విన్నవించారు.

## ప్రొఫెసర్ ముప్పా నరసింహా రెడ్డి ఇకలేరు



హైదరాబాద్, జనవరి 4 (ఈవార్తలు): ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ముప్పా నరసింహారెడ్డి ఆదివారం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. నరసింహా రెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నల్లగొండ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన ప్రొఫెసర్ ముప్పా నరసింహా రెడ్డి 17 జనవరి 1941లో జన్మించారు. ఆయనకు భార్య ఎం. భారతి, కుమార్తె ఎం. అర్పితారెడ్డి, అల్లుడు ఎం.గోపాల్ రెడ్డి ఐఏఎస్ ఉన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన, ఆక్కడే మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందించారు. లెక్చరర్ రీడర్, అనంతరం భూ విజ్ఞాన విభాగంలో ప్రొఫెసర్ గా (1999-2001) విధులు నిర్వహిస్తూ విభాగాధిపతిగా 1995-1998 వరకు బాధ్యతలు నిర్వహించారు. ఎనిమిది మంది పీహెచ్డీ విద్యార్థులకు మార్గనిర్దేశం చేసి, జాతీయ స్థాయి పరిశోధన ప్రాజెక్టులకు విలువైన సేవలు అందించారు. 1989లో నిర్వహించిన 8వ భారతీయ అంటార్కిటికా శాస్త్రయాత్రలో భారతీయ విశ్వవిద్యాలయాల తరఫున ఏకైక ప్రతినిధిగా పాల్గొని ప్రశంసా పత్రం పొందారు. ఆయన జీవితంలోని అత్యంత గౌరవప్రద ఘట్టం ఇది. అనంతరం మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యుడిగా, స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్ గా, ఢిల్లీ ఐఐటీ గవర్నింగ్ బాడీ సభ్యుడిగా సేవలందించి విద్యా రంగానికి విశేష గౌరవం తీసుకొచ్చారు. వృత్తిపరమైన విజయాలకే పరిమితం కాకుండా కుటుంబానికి అంకితమైన వ్యక్తిగా సత్యనిష్ఠ, మానవీయత, వినయంతో అందరి గౌరవాన్ని పొందారని పలువురు ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆయన జ్ఞానం, మార్గదర్శకత్వం అనేక జీవితాలను ప్రభావితం చేసిందన్నారు. జ్ఞానం, సేవ, విలువలతో నిర్మితమైన ఆయన వారసత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు.

## ఏపీ డీసీసీ అధ్యక్షుల ప్రకటన

విజయవాడ, జనవరి 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీల (డీసీసీ) అధ్యక్షులను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అధికారికంగా జాబితాను విడుదల చేశారు. జిల్లాలు, ముఖ్య పట్టణాలకు కలిపి మొత్తం 41 మంది అధ్యక్షుల పేర్లను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో నియమించినట్లు వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. ప్రతి జిల్లాకు నియమించిన ఏఐసీసీ పర్యవేక్షకులు విస్తృత స్థాయిలో సమీక్షలు నిర్వహించి, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు, స్థానిక నేతలు, ముఖ్య వ్యక్తులతో చర్చలు జరిపిన అనంతరం సమగ్ర నివేదికలు సమర్పించారని వెల్లడించారు. ఆ నివేదికల ఆధారంగానే కొత్త అధ్యక్షుల ఎంపిక జరిగిందని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

## సింగపూర్‌లో అర్ధరాత్రి ఒంటరిగా నడుస్తున్నా: భారత మహిళ

సింగపూర్: సింగపూర్ లో అర్ధరాత్రి నిర్భయంగా నడుస్తున్నా.. అంటూ భారత మహిళ ఒకరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తన వెనుక ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేవని, తాను ఒంటరిగానే ఉన్నానని ఆమె చెప్పారు. తెల్లవారుజామున 3 గంటలకు నిర్మానుష్యంగా ఉన్న రోడ్లను ఆమె చూపించారు. రోడ్లపై ఎవరూ లేకున్నా తనకు ఎలాంటి భయాందోళన లేదని తెలిపారు. ఇదే పరిస్థితి భారతదేశంలో ఎదురైతే వణికిపోయేదాన్నని, ఇలాంటి పరిస్థితిని కలలో కూడా ఊహించలేనని ఆమె వ్యాఖ్యానించారు. ఇన్ స్టాలో వైరల్ గా మారిన వీడియోలోని వివరాల ప్రకారం.. కృతికా జైన్ అనే భారత మహిళ కొంతకాలంగా సింగపూర్ లో ఉంటున్నారు. ఇటీవల ఆఫీసులో తన విధులు పూర్తిచేసుకుని తెల్లవారుజామున 3 గంటలకు ఒంటరిగా ఇంటికి బయలుదేరారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నప్పటికీ ఎలాంటి భయం లేకుండా, ప్రకృతిని ఆస్వాదిస్తూ ఇంటికి వెళుతున్నానని కృతికా జైన్ చెప్పారు. ఇదే సమయంలో భారతదేశంలో తాను ఇంట్లో నుంచి బయటకు అడుగుపెట్టాలన్నా భయపడేదానినని అన్నారు. సింగపూర్ లోని పర్యాటక ప్రాంతాలకన్నా అర్ధరాత్రి మహిళలు కూడా నిర్భయంగా బయటకు వెళ్లగలిగే అవకాశం ఉండటమే తనకు బాగా నచ్చిన విషయమని తెలిపారు. భారత్ లో లాగా భద్రత అనేది సింగపూర్ లో లగ్జరీ కాదని, సామాన్యులకు కూడా అందుబాటులో ఉండే నిత్యావసరం లాంటిదని పేర్కొన్నారు. ఈ వీడియో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. భారత్, సింగపూర్ లలో మహిళల భద్రతపై నెటిజన్ల మధ్య చర్చకు దారితీసింది.

## ఉత్తరకొరియా బాలిస్టిక్ క్షపణి ప్రయోగం

**జపాన్, దక్షిణ కొరియాలో హై అలెర్ట్**

ప్యాంగ్యాంగ్: కొన్ని రోజుల విరామం తర్వాత ఉత్తర కొరియా తన క్షపణి ప్రయోగాలతో తూర్పు ఆసియాలో మళ్లీ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆదివారం ఉదయం ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షపణులను ప్రయోగించినట్లు గుర్తించిన జపాన్ ప్రభుత్వం తన దేశ ప్రజలకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. సుమారు రెండు నెలల తర్వాత ఉత్తర కొరియా జరిపిన మొదటి బాలిస్టిక్ క్షపణి పరీక్ష ఇదే కావడం గమనార్హం. ఉత్తర కొరియా క్షపణి ప్రయోగం చేసినట్లు జపాన్ ప్రధాని కార్యాలయం ధ్రువీకరించింది. జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం ఈ క్షపణి అప్పటికే సముద్రంలో పడిపోయి ఉంటుందని భావిస్తున్నారు. మరోవైపు, ఆదివారం ఉదయం 7:50 గంటల ప్రాంతంలో రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపంలోని తీరం నుంచి ఉత్తర కొరియా వరుసగా పలు క్షపణులను సముద్రంలోకి ప్రయోగించిందని దక్షిణ కొరియా సైన్యం ప్రకటించింది. అమెరికా, జపాన్ దేశాలతో కలిసి పరిస్థితిని తాము నిశితంగా గమనిస్తున్నామని సియోల్ వెల్లడించింది. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ చైనా పర్యటనకు బయలుదేరుతున్న తరుణంలో ఈ ప్రయోగాలు జరగడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. కొరియా ద్వీపకల్పంలో శాంతి నెలకొనేలా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సానుకూలంగా స్పందిస్తారని దక్షిణ కొరియా ఆశిస్తున్న వేళ.. కిమ్ జోంగ్ ఉన్ క్షపణులతో కవ్వింపులకు దిగారు. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ శనివారమే ఒక భారీ ఆయుధ కర్మాగారాన్ని సందర్శించారు.



# పద్మశాలి 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

**గెలిచిన సర్పంచ్ అభ్యర్థులకూ సన్మానం.. కార్యక్రమంలో పాల్గొన్న పద్మశాలీ సోదరులు**

మల్యాల, జనవరి 4 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో పద్మశాలి సంఘానికి చెందిన 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం కొత్తపేటలోని శ్రీ ఆంజనేయరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి జిల్లాలోని పద్మశాలీలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మల్యాల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బొట్ల జయ ప్రసాద్, ఉపసర్పంచ్ కట్కం విజయ్, మల్యాల మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య, ఉపాధ్యక్షుడు వీరభద్ర ప్రసాద్, కోశాధికారి బొమ్మకంటి గంగాధర్, పెంట సుధాకర్, వైద్యులు బింగి నరేశ్, బింగి హిమబిందు, సీహెచ్ శ్రీకాంత్, ఏ నాగరాణి, అంకం అరుణ, అంకం లక్ష్మణ్, ఎనుగందుల శ్రీపతితో పాటు గాజుల గంగమల్లు, బాలె శ్రీనివాస్, ఎన్నం చంద్రశేఖర్, భోగ వేంకటేశ్వర్లు, పద్మశాలీలు పాల్గొన్నారు.

**ముత్యంపేట నూతన కార్యవర్గం ఏర్పాటు**

మరోవైపు, మల్యాల మండలం ముత్యంపేటలో పద్మశాలి నూతన సంఘం సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కొండబత్తిని శ్రీనాథ్, ఉపాధ్యక్షుడిగా చెట్పల్లి చక్రధర్, గౌరవాధ్యక్షుడు గడ్డం రమేశ్, కోశాధికారి వేముల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా బాలె నవీన్, సంయుక్త కార్యదర్శిగా బాలె మధు సహా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# వైసీపీ హయాంలోనే అసలైన అభివృద్ధి

**చీపురుపల్లి రైల్వే బ్రిడ్జి 80 శాతం పనులు పూర్తి.. నిర్మాణానికి రూ.12.55 కోట్లు నిధులు తీసుకువచ్చాం**

**20 శాతం పనులకు 20 నెలలు తీసుకున్న కూటమి ప్రభుత్వం**

**విజయనగరం మాజీ పార్లమెంట్ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్**



విజయనగరం, జనవరి 4 (ఈవార్తలు): వైసీపీ ప్రభుత్వ హయాంలోనే చీపురుపల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు 80 శాతం పూర్తి చేశామని, మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేయడానికి 20 నెలలు సమయం తీసుకున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు దాన్ని తామే పూర్తి చేశామన్నట్టు ఆర్భాటపు ప్రచారాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని విజయనగరం మాజీ పార్లమెంట్ సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ కమిటీ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ (పెదబాబు) పేర్కొన్నారు. చీపురుపల్లి రైల్వే బ్రిడ్జిపై ఆదివారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఆయన ఈ సందర్భంగా బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి వైట్ పేపర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.12.55 కోట్ల రూపాయలు నిధులను తీసుకువచ్చినట్టు వెల్లడించారు. మిగిలిన 20 శాతం పనులను పూర్తి చేయడానికి 20 నెలలు సమయం తీసుకున్న కూటమి ప్రభుత్వం.. తామే బ్రిడ్జిని తీసుకువచ్చి, నిర్మాణం చేసినట్టు ఆర్భాటపు ప్రచారాలకు పాల్పడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టేందుకు అడ్డంకులను తొలగించడంతోపాటు త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు తాము ఎంతగానో కృషి చేశామన్నారు. కానీ, ఇప్పుడు కూటమి నాయకులు తామేదో ఘన కార్యం సాధించినట్టు ప్రచారాలకు పాల్పడడం దారుణమన్నారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలోనే బ్రిడ్జి పనులు శరవేగంగా సాగిన విషయం ఈ ప్రాంత ప్రజలకు తెలుసనని స్పష్టం చేశారు. ఈ తరహా తప్పుడు ప్రచారాలతో ప్రజలను ఏమార్చేందుకు కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారని, కానీ, ప్రజలకు వాస్తవాలు తెలుసని స్పష్టం చేశారు. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తాను ఎంపీగా ఉన్నప్పుడు ఈ బ్రిడ్జి నిర్మాణానికి తీవ్రంగా కృషి చేసినట్టు వెల్లడించారు. అప్పటి తమ ప్రభుత్వం కూడా ఈ బ్రిడ్జి నిర్మాణానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వడం వల్లే ప్రస్తుతం అందరికీ అందుబాటులోకి వచ్చే పరిస్థితి ఏర్పడినట్టు ఆయన వెల్లడించారు. ప్రజలకు మేలు చేసే విషయంలో తామెప్పుడూ నిర్లక్ష్యం చేయలేదన్నారు. తాము చేసిన పనులను చెప్పుకోలేకపోవడం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలన్న ఉద్దేశంతోనే ఇప్పుడు బయటకు వచ్చి నిజాలు చెబుతున్నట్టు వెల్లడించారు. సమావేశంలో చీపురుపల్లి మండల పార్టీ అధ్యక్షుడు మీసాల వరహాల నాయుడు, ఎంపీపీ ఇప్పిలి అనంతం, జడ్పీటీసీ వలిరెడ్డి శ్రీనువాస నాయుడు, చీపురుపల్లి నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, మండల వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## 2036 ఒలింపిక్స్ నిర్వహణకు కృషి

**వారణాసిలో ప్రధాని మోదీ వెల్లడి**

వారణాసి: భారతదేశం క్రీడా రంగంలో సరికొత్త శిఖరాలను అధిరోహించే దిశగా అడుగులు వేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ఆయన.. క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్ భవిష్యత్తులో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్ల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే లక్ష్యంగా భారత్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్ హక్కులను దక్కించుకోవడానికి ఎక్కడా రాజీపడకుండా కృషి చేస్తున్నామన్నారు. అలాగే, 2030 కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో భారత్ తన సత్తాను చాటుతోందని, గత దశాబ్ద కాలంలో అండర్-17 ఫిఫా వరల్డ్ కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్లతో సహా 20కి పైగా అంతర్జాతీయ ఈవెంట్లను మన దేశం విజయవంతంగా నిర్వహించిందని గుర్తు చేశారు. వాలీబాల్ క్రీడ గొప్పతనాన్ని వివరిస్తూ.. ఇది కేవలం ఆట మాత్రమే కాదని, సహకారం, సమతుల్యత (బ్యాలెన్స్)తో కూడిన ప్రక్రియ అని మోదీ అభివర్ణించారు. బంతిని కింద పడకుండా గాలిలోనే ఉంచేందుకు చేసే ప్రయత్నంలో క్రీడాకారుల పట్టుదల కనిపిస్తుందన్నారు. టీమ్ ఫస్ట్ అనే నినాదంతో ప్రతి క్రీడాకారుడు జట్టు విజయం కోసమే ఆడాలని సూచించారు. వ్యక్తిగత నైపుణ్యాలు వేరైనా, సమష్టి కృషితోనే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ 72వ జాతీయ వాలీబాల్ టోర్నీలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, సంస్థల నుంచి 58 జట్లు పాల్గొంటున్నాయి. సుమారు 1,000 మందికి పైగా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ టోర్నీ ద్వారా భారతీయ వాలీబాల్‌లో ఉన్న అత్యుత్తమ ప్రమాణాలు, క్రీడాస్ఫూర్తి వెలుగులోకి వస్తాయని నిర్వాహకులు ఆశిస్తున్నారు.

# మూగజీవాల రక్తంతో యాపారం

**మేడ్చల్ జిల్లాలో అక్రమ దందా**

**నకిలీ వెటర్నరీ డాక్టర్, మటన్ షాప్ యజమాని అరెస్ట్**

నాగారం/హైదరాబాద్, జనవరి 4 (ఈవార్తలు): డబ్బు సంపాదన కోసం కొందరు ఎంతటి దారుణాలకైనా పాల్పడుతున్నారు. మూగజీవాలను హింసిస్తూ వాటి రక్తంతో వ్యాపారం చేస్తున్న ఓ ముఠా గుట్టును మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పోలీసులు రట్టు చేశారు. వైద్య వృత్తి పేరుతో ఓ నకిలీ పశువైద్యుడు సాగిస్తున్న ఈ దారుణ దందా వివరాలు విస్మయానికి గురిచేస్తున్నాయి. మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో ఈ అమానుష ఘటన చోటుచేసుకుంది. స్థానిక మటన్ షాప్ యజమాని, ఓ నకిలీ వెటర్నరీ డాక్టర్‌తో కలిసి ఈ అక్రమ దందాను నిర్వహిస్తున్నాడు. గొర్రెలు, మేకలకు ఎలాంటి మత్తుమందు ఇవ్వకుండా, అత్యంత క్రూరంగా సూదులతో వాటి శరీరం నుంచి రక్తాన్ని పీల్చేస్తున్నారు. కేవలం రక్తమే కాకుండా, దాని నుంచి ప్లేట్‌లెట్లను వేరు చేసి ప్యాకెట్లలో నిల్వ చేస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారంపై సమాచారం అందుకున్న పోలీసులు ఆ కేంద్రంపై మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో ఏకంగా 180 రక్తపు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులు అడ్డగోలుగా రక్తాన్ని తీయడం వల్ల ఆ మూగజీవాలు తీవ్ర రక్తహీనతకు గురై, ఒకటి రెండు రోజుల్లోనే ప్రాణాలు కోల్పోతున్నాయని అధికారులు గుర్తించారు. తమ స్వార్థం కోసం బతికున్న జంతువులను ఇలా హింసించడం చట్టరీత్యా తీవ్రమైన నేరం. ఈ రక్తాన్ని, దాని నుంచి తీసిన ప్లేట్‌లెట్లను కొన్ని రకాల వ్యాధులకు మందుగా నమ్మించి, ఇతర రాష్ట్రాలకు అధిక ధరలకు అమ్ముతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అయితే, జంతువుల రక్తం తాగితే వ్యాధులు నయమవుతాయనడంలో ఎలాంటి శాస్త్రీయ ఆధారం లేదని, ఇలాంటి మూఢనమ్మకాలతో ప్రజలు తమ ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడవేసుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు మటన్ షాప్ యజమానిని, నకిలీ డాక్టర్‌ను అరెస్ట్ చేశారు. వారిపై జంతు హింస నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దందా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో లోతుగా విచారణ కొనసాగుతోంది.



# భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం

**విజయవంతంగా ల్యాండింగ్**

**ఢిల్లీ నుంచి వచ్చిన రామ్మోహన్ నాయుడు, అధికారులు**

భోగాపురం, జనవరి 4 (ఈవార్తలు): ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక ముందడుగు పడింది. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం తొలిసారి విమానం ల్యాండ్ అయింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా ఏ320 కమర్షియల్ వ్యాలిడేషన్ ఫ్లైట్ విజయవంతంగా భోగాపురం ఎయిర్ పోర్టులో ల్యాండ్ అయింది. ఇందులో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఇతర అధికారులు ప్రయాణించారు. విమానాశ్రయం ప్రారంభానికి ముందు రన్‌వే, నావిగేషన్ వ్యవస్థల పనితీరును పరిశీలించేందుకు ఈ ట్రయల్ రన్ నిర్వహించారు. 3.8 కిలోమీటర్ల పొడవైన రన్‌వేపై విమానం సురక్షితంగా దిగడంతో, ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు దాదాపు 97 శాతం పూర్తయి తుది దశకు చేరుకున్నట్లు స్పష్టమైంది. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, ఇక్కడ ఏవియేషన్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలనేది నారా లోకేశ్ ఆలోచన అని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టంపై మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ, ప్రధాని మోదీ దార్శనికతతో 2014-19 ఎన్డీఏ హయాంలో ప్రారంభించిన ఈ విమానాశ్రయం, 2026 జూన్ నాటికి వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధమవుతుందని తెలిపారు. ఇది ఉత్తరాంధ్రను కొత్త శిఖరాలకు చేర్చుతుందని ధీమా వ్యక్తం చేశారు. సుమారు రూ.4,592 కోట్ల వ్యయంతో జీఎంఆర్ సంస్థ పీపీపీ పద్ధతిలో ఈ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తోంది. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా దీనిని తీర్చిదిద్దారు. రానున్న 4-5 నెలల్లోనే వాణిజ్య సేవలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



## మా పునాది వల్లే: జగన్

విశాఖపట్నంలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి విమానం ల్యాండ్ అవ్వడంపై వైసీపీ అధినేత జగన్ స్పందించారు. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో ఒక మైలురాయి అని, విజన్ వైజాగ్ లక్ష్య సాధన దిశగా పడిన కీలక అడుగు అని ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుత దశకు చేరుకోవడానికి తమ ప్రభుత్వ హయాంలో వేసిన బలమైన పునాదే కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్ స్పందిస్తూ, ‘మా పాలనా కాలంలో ఈ ప్రాజెక్టుకు వేగవంతమైన అనుమతులు సాధించాం. భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం కోసం సుమారు రూ. 960 కోట్లు ఖర్చు చేయడం ద్వారా ప్రాజెక్టుకు పటిష్ఠమైన పునాది వేశాం. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన పనుల్లో గణనీయమైన భాగం అప్పుడే పూర్తయింది. ఆ రోజు మేం చేసిన కృషే ఇవాళ్టి ఈ కీలక మైలురాయిని చేరుకోవడానికి ముఖ్య కారణం అని వివరించారు.






# కరెంటు లేదు.. తిండి లేదు

వెనిజులాలో పరిస్థితులు దారుణం

కారకస్: వెనెజులాపై అమెరికా జరిపిన ఆకస్మిక మెరుపు దాడులతో ఆ దేశం అంధకారంలోకి జారుకుంది. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా జరిగిన ఈ దాడుల్లో కీలకమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్ గ్రిడ్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో దేశ రాజధాని కారకాస్‌తో పాటు అనేక నగరాలు, పట్టణాలు అంధకారంలో చిక్కుకున్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఆహారం, తాగునీరు, మందులు వంటి నిత్యావసరాల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దాడుల తదనంతర పరిణామాలను, అక్కడి ప్రజల దయనీయ స్థితిని కారకాస్‌లో నివసిస్తున్న సునీల్ మల్హోత్రా అనే భారతీయుడు మీడియాకు వివరించారు. దాడుల ప్రభావంతో దేశంలో తీవ్ర భయాందోళనకర వాతావరణం నెలకొందని సునీల్ మల్హోత్రా తెలిపారు. అమెరికా దాడులతో భారీ నష్టం వాటిల్లింది. ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థ కుప్పకూలింది. కరెంటు లేకపోవడంతో కారకాస్‌లోని అన్ని ప్రధాన సూపర్ మార్కెట్లు, పెద్ద దుకాణాలు మూతపడ్డాయి. కేవలం కొన్ని చిన్న దుకాణాలు మాత్రమే తెరిచి ఉన్నాయి. వాటి ముందు నిత్యావసరాల కోసం ప్రజలు బారులు తీరుతున్నారు. ఒక్కో దుకాణం ముందు 500 నుంచి 600 మంది వరకు పొడవైన క్యూలలో గంటల తరబడి నిలబడుతున్నారు. మందుల కోసం ఫార్మసీల వద్ద కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా జంకుతున్నారని, దీంతో నగరంలోని చాలా ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో అమెరికా సైన్యం కీలకమైన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుందని సునీల్ తెలిపారు. కారకాస్ అంతర్జాతీయ విమానాశ్రయంపై దాడి జరిగింది. నగరానికి సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేశంలోనే అతిపెద్ద వైమానిక స్థావరం కూడా ధ్వంసమైంది. ముఖ్యంగా, ఫోర్ట్ ట్యూనా మిలిటరీ స్థావరంపై జరిగిన దాడిలో ఎక్కువ నష్టం సంభవించినట్లు తెలుస్తోంది అని ఆయన వివరించారు. ఈ దాడుల వల్ల ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయిందని, బస్సులు, ఇతర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని చెప్పారు. కరెంటు సరఫరా లేకపోవడంతో ఆధునిక జీవన విధానంలో అత్యంత కీలకమైన మొబైల్ ఫోన్ల వాడకం కష్టతరంగా మారింది. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినడంతో ప్రజలు తమ ఆత్మీయులతో మాట్లాడటానికి, సమాచారం తెలుసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఫోన్లు ఛార్జ్ చేసుకునేందుకు ప్రజలు పడుతున్న పాట్లు అక్కడి దయనీయ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. రోడ్లపై అడపాదడపా వెలుగుతున్న కొన్ని సోలార్ విద్యుత్ దీపాల కిందకు చేరి ప్రజలు తమ ఫోన్లకు ఛార్జింగ్ పెట్టుకుంటున్నారు. తాను కూడా తన ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టేందుకు చాలా దూరం నడిచి వెళ్లాల్సి వచ్చిందని సునీల్ మల్హోత్రా చెప్పారు. విద్యుత్ సరఫరా ఎప్పుడు పునరుద్ధరించబడుతుందనే దానిపై స్థానిక అధికారుల నుంచి ఎలాంటి స్పష్టమైన సమాచారం లేదని, దీంతో ప్రజల్లో అనిశ్చితి, ఆందోళన మరింత పెరిగాయని ఆయన అన్నారు.

## జైలుకు వెళ్తూ హ్యాపీ న్యూఇయర్ చెప్పిన మదురో



న్యూయార్క్: అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ, వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైనిక దళాలు బంధించాయి. వెనెజులా రాజధాని కారకాస్‌లో అత్యంత రహస్యంగా, హై-రిస్క్ ఆపరేషన్ నిర్వహించి మదురోను అదుపులోకి తీసుకుని న్యూయార్క్‌కు తరలించాయి. డ్రగ్ ట్రాఫికింగ్, ఆయుధాల అక్రమ సరఫరా వంటి తీవ్రమైన ఆరోపణలపై మదురోను అరెస్ట్ చేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు. కాగా, మదురోను న్యూయార్క్‌లోని ఫెడరల్ డిటెన్షన్ సెంటర్‌కు తరలిస్తున్నప్పటి వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోలో, చేతులకు సంకెళ్లు వేసి, కాళ్లకు చెప్పులతో ఉన్న మదురో, తన పక్కనున్న వారిని ఆంగ్లంలో గుడ్ నైట్.. హ్యాపీ న్యూ ఇయర్ అని విష్ చేయడం గమనార్హం. వాహనం నుంచి దిగుతున్నప్పుడు నొప్పితో మూలుగుతున్నట్లు కనిపించడంతో, అరెస్ట్ సమయంలో ఆయనకు గాయాలై ఉండొచ్చని ఆన్‌లైన్‌లో చర్చ జరుగుతోంది. ఈ అనూహ్య పరిణామంతో వెనిజులా తీవ్ర సంక్షభంలోకి జారుకుంది. కారకాస్‌లో భద్రతా బలగాలు మోహరించాయి. ఈ నేపథ్యంలో వెనిజులా సుప్రీం కోర్టు, ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను తాత్కాలిక అధ్యక్షురాలిగా నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

## వెనెజులా ఘటన..
# వామపక్షాల నిరసనలు

న్యూఢిల్లీ: వెనెజులాపై అమెరికా సైనిక చర్యకు దిగడం, ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను బంధించడాన్ని నిరసిస్తూ పలు వామపక్ష పార్టీలు ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టాయి. వెనెజులాపై అమెరికా చర్యను సామ్రాజ్యవాద సైనిక దురాక్రమణగా అభివర్ణించిన



సీపీఎం, దీన్ని ప్రపంచ దేశాలు ఖండించాలని పిలుపునిచ్చింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన, దృఢమైన వైఖరి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ దాడిని సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), ఆర్ఎస్‌పీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అమెరికా చర్య ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను ఉల్లంఘించడమేనని ఆ పార్టీల ప్రధాన కార్యదర్శులు ఎం.ఏ. బేబీ, డి. రాజా, దీపాంకర్ భట్టాచార్య, జి. దేవరాజన్, మనోజ్ భట్టాచార్య సంయుక్త ప్రకటనలో తెలిపారు. వెనెజులా చమురు నిల్వలను స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ చెప్పడంతోనే వారి అసలు ఉద్దేశం బయటపడింది. క్యూబా, మెక్సికో తమ తదుపరి లక్ష్యాలని అమెరికా విదేశాంగ మంత్రి హెచ్చరించారు అని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని, అమెరికా చర్యను ఖండించాలని, వెనెజులాకు సంఘీభావం ప్రకటించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. వెనెజులా రాజధాని కారకాస్‌పై తమ బలగాలు భారీ దాడి చేశాయని, అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను బంధించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ నిరసనలు జరిగాయి. మరోవైపు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నార్కో-టెర్రరిజం ఆరోపణలపై విచారణ ఎదుర్కొనేందుకు మదురోను న్యూయార్క్‌కు తరలించారు. రెండు దశాబ్దాలుగా అమెరికాకు భారీగా కొకైన్ తరలించేందుకు మదురో తన అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని యూఎస్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు.

# డ్రగ్స్ ముఠాల నుంచి లంచాలు

### వెనెజులా అధ్యక్షుడి భార్యపై అమెరికా ఆరోపణలు



వాషింగ్టన్: వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్ ప్రస్తుతం అమెరికా కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. శనివారం నాడు నిర్వహించిన ఆపరేషన్ లో అమెరికా బలగాలు మదురోను, ఆయన భార్యను అదుపులోకి తీసుకుని అమెరికా తరలించారు. కాగా, వెనెజులా దేశంలో అత్యంత శక్తివంతమైన మహిళగా భావించే సిలియా ఫ్లోరెస్ పై అమెరికా ప్రాసిక్యూటర్లు సంచలన ఆరోపణలు చేశారు. మాదకద్రవ్యాల రవాణాను సులభతరం చేసేందుకు ఆమె లంచాలు స్వీకరించారని, దేశంలోని యాంటీ-డ్రగ్ కార్యాలయాన్ని తన ప్రయోజనాల కోసం వాడుకున్నారని తీవ్రమైన అభియోగాలు మోపారు. ఈ పరిణామం మదురో ప్రభుత్వానికి అంతర్జాతీయంగా తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. అమెరికా ఇండిక్ట్‌మెంట్ ప్రకారం, డ్రగ్స్ రవాణాను సులభతరం చేసేందుకు సిలియా ఫ్లోరెస్ లక్షలాది డాలర్ల లంచాలు స్వీకరించినట్లు ఆరోపణలున్నాయి. 2007లో ఓ ప్రముఖ డ్రగ్ ట్రాఫికర్‌ను, అప్పటి వెనెజులా జాతీయ యాంటీ-డ్రగ్ కార్యాలయ డైరెక్టర్ నెస్టర్ రెవెరోల్ టోరెస్‌కు పరిచయం చేసేందుకు ఆమె ఈ లంచాలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత ఆ డ్రగ్స్ స్మగ్లర్, డైరెక్టర్‌కు నెలవారీ లంచాలతో పాటు, కొకైన్‌తో వెళ్లే ప్రతి విమానానికి సుమారు 1 లక్ష డాలర్లు చెల్లించేలా ఒప్పందం కుదిరింది. ఈ మొత్తంలో కొంత భాగం సిలియా ఫ్లోరెస్ కు చేరినట్లు అమెరికా ఆరోపిస్తోంది. నెస్టర్ రెవెరోల్‌పై 2015లోనే న్యూయార్క్‌లో నార్కోటిక్స్ కేసు నమోదైంది. ప్రస్తుతం ఆయన పరారీలో ఉన్నారు. సిలియా ఫ్లోరెస్ కుటుంబ సభ్యులపై కూడా మాదకద్రవ్యాల కార్యకలాపాలకు సంబంధించి తీవ్రమైన కేసులున్నాయి. ఆమె సోదరి కుమారులకు 2017లో ఓ డ్రగ్స్ కేసుకు సంబంధించి అమెరికాలో 18 ఏళ్ల జైలు శిక్ష పడింది. దేశాధ్యక్షుడి విమానాలు నిలిపే హ్యాంగర్ నుంచే కొకైన్ అక్రమ రవాణా చేశారన్నది వీరిపై ఉన్న అభియోగం. అయితే, 2022లో ఏడుగురు అమెరికన్ల విడుదలకు బదులుగా జరిగిన ఖైదీల మార్పిడిలో వీరిని విడుదల చేశారు. ఒకప్పుడు సాధారణ న్యాయవాదిగా ఉన్న సిలియా ఫ్లోరెస్, 1990లలో మాజీ అధ్యక్షుడు హ్యూగో చావెజ్ సోషలిస్ట్ ఉద్యమంలో చేరి రాజకీయంగా ఉన్నత స్థాయికి ఎదిగారు. చట్టసభల్లో కీలక పాత్ర పోషించిన ఆమె, 1990ల చివరి నుంచి నికోలస్ మదురోతో సన్నిహితంగా ఉన్నారు. 2013లో ఆయన్ను వివాహం చేసుకున్నారు. మదురో అధికారాన్ని పటిష్టం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. అధికారికంగా ఏ పదవిలో లేకపోయినా, తెరవెనుక దేశంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా సిలియా ఫ్లోరెస్ చక్రం తిప్పుతున్నారని పేరుంది. ఈ ఆరోపణలు కేవలం సిలియా ఫ్లోరెస్ కే పరిమితం కాలేదు. తన భర్త నికోలస్ మదురో, కుమారుడితో కలిసి ఫ్లోరెస్ తమ రాజకీయ అధికారాన్ని డ్రగ్స్ రవాణాకు అనుకూలంగా మార్చుకున్నారని అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపిస్తున్నారు. మదురోపై నార్కో-టెర్రరిజం, కొకైన్ స్మగ్లింగ్ కుట్ర, ఆయుధాల వినియోగం వంటి పలు తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి. మొత్తం మీద, ఈ ఆరోపణలు వెనెజులా రాజకీయాల్లో మాదకద్రవ్యాల మాఫియా పాత్రను, అధికార దుర్వినియోగాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ కేసులతో సిలియా ఫ్లోరెస్ పాత్ర మరింత వివాదాస్పదంగా మారింది.

# వెనిజులాకు ఉచిత ఇంటర్నెట్

### ఎలాన్ మస్క్ కీలక ప్రకటన



న్యూయార్క్: టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వెనిజులా ప్రజలకు భారీ ఊరట కల్పిస్తూ కీలక ప్రకటన చేశారు. దేశంలో నెలకొన్న సంక్షభ పరిస్థితుల నేపథ్యంలో, ప్రజలకు నిరంతరాయంగా ఇంటర్నెట్ కనెక్టివిటీ అందించేందుకు నెల రోజుల పాటు స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ఉచితంగా అందిస్తున్నట్టు ఆదివారం ప్రకటించారు. వెనిజులా ప్రజలకు మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో వెల్లడించారు. అమెరికా సైనిక చర్యలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో పట్టుబడిన కొద్దిసేపటికే మస్క్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. మదురో అరెస్ట్‌ను స్వాగతించిన మస్క్, ఆయన పాలన ముగియడంతో ఇకనైనా వెనిజులా అభివృద్ధి పథంలో పయనించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. వెనిజులా ఇప్పుడు శ్రేయస్సును పొందగలదు అని స్పానిష్ భాషలో వ్యాఖ్యానించారు. లో-ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ల ద్వారా పనిచేసే స్టార్‌లింక్ నెట్‌వర్క్, దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొన్న ఈ సమయంలో కనెక్టివిటీ సమస్యలు లేకుండా చూస్తుంది. ఫిబ్రవరి 3 వరకు ఈ ఉచిత సేవలు అందుబాటులో ఉంటాయి. మదురో ప్రభుత్వంపై మస్క్ మొదటి నుంచి తీవ్ర విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన స్పందన ఎవరినీ ఆశ్చర్యపరచలేదు. మదురో ప్రభుత్వ విధానాల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని ఆయన చాలాకాలంగా ఆరోపిస్తున్నారు. 2024 ఎన్నికల సమయంలో ప్రతిపక్షానికి బహిరంగంగా మద్దతు పలికిన మస్క్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, ప్రతిపక్ష నేత మారియా కొరినా మచాడోకు అండగా నిలిచారు. సహజ వనరులు పుష్కలంగా ఉన్న వెనిజులా, సరైన నాయకత్వం లేకపోవడం వల్లే అభివృద్ధికి దూరమైందని మస్క్ గతంలో పలుమార్లు పేర్కొన్నారు.

# వెనెజులా అధ్యక్ష బాధ్యతల్లో ఉపాధ్యక్షురాలు

కారకస్: వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైనిక బలగాలు బంధించిన నేపథ్యంలో ఆ దేశ రాజకీయాలు ఒక్కసారిగా సంక్షభంలోకి జారుకున్నాయి. ఈ నాటకీయ పరిణామాల మధ్య దేశ ఉపాధ్యక్షురాలైన డెల్సీ రోడ్రిగ్జ్ పేరు అంతర్జాతీయంగా ప్రముఖంగా వినిపిస్తోంది. వెనెజులా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆమె వెంటనే అధ్యక్ష బాధ్యతలను తాత్కాలికంగా స్వీకరించారు. మదురో అరెస్ట్ అయినప్పటికీ ఆయనే దేశానికి ఏకైక అధ్యక్షుడు అని డెల్సీ రోడ్రిగ్జ్ మొదట ప్రకటించారు. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు దీనికి భిన్నంగా ఉన్నాయి. డెల్సీ ఇప్పటికే అధ్యక్షురాలిగా ప్రమాణం చేశారని, వెనెజులాను మళ్లీ గొప్పగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారని ట్రంప్ తెలిపారు. సమీప భవిష్యత్తులో వెనెజులాను అమెరికానే నడిపిస్తుందని కూడా ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అనిశ్చితిలో కూరుకుపోయిన వెనెజులాకు నాయకత్వం వహిస్తున్న డెల్సీ రోడ్రిగ్జ్ నేపథ్యంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 1969 మే 18న కారకాస్‌లో జన్మించిన డెల్సీ రోడ్రిగ్జ్, వామపక్ష గెరిల్లా యోధుడు, లిగా సోషలిస్టా పార్టీ వ్యవస్థాపకుడు జార్జ్ ఆంటోనియో రోడ్రిగ్జ్ కుమార్తె. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ వెనెజులాలో న్యాయశాస్త్రం అభ్యసించారు. గత రెండు దశాబ్దాలుగా మాజీ అధ్యక్షుడు హ్యూగో చావెజ్ స్థాపించిన చావిస్మో రాజకీయ ఉద్యమంలో ఆమె అత్యంత ప్రభావవంతమైన వ్యక్తిగా కొనసాగుతున్నారు. 2014 నుంచి 2017 వరకు కమ్యూనికేషన్ మంత్రిగా, ఆ తర్వాత విదేశాంగ మంత్రిగా పనిచేశారు. మానవ హక్కుల ఉల్లంఘనలు, ఎన్నికల మోసాలపై అంతర్జాతీయ విమర్శలు ఎదుర్కొంటున్న మదురో ప్రభుత్వాన్ని ఆమె గట్టిగా సమర్థించారు. 2018లో మదురో ఆమెను ఉపాధ్యక్షురాలిగా నియమించారు. తన సోషలిస్ట్ ప్రభుత్వాన్ని నిక్కచ్చిగా సమర్థించే ఆమెను మదురో టైగర్ అని పిలిచేవారు. మదురో పట్టుబడటానికి ముందు వరకు ఆమె దేశ ప్రధాన ఆర్థిక అధికారిగా, పెట్రోలియం మంత్రిగా కూడా వ్యవహరించారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు, ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవడానికి ఆమె కొన్ని సంప్రదాయ ఆర్థిక విధానాలను అమలు చేశారని రాయిటర్స్ నివేదించింది. మదురో అరెస్ట్ తర్వాత ఆమె జాతీయ రక్షణ మండలి సమావేశానికి అధ్యక్షత వహించి, మదురోను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అమెరికా చర్య అంతర్జాతీయ చట్టాలను, వెనెజులా సార్వభౌమత్వాన్ని దారుణంగా ఉల్లంఘించడమేనని, ఈ చర్యను లాటిన్ అమెరికా దేశాలు తీవ్రంగా ఖండించాలని ఆమె పిలుపునిచ్చారు.

# కొలంబియాకూ ట్రంప్ వార్నింగ్

వాషింగ్టన్: వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్టు చేసి అమెరికాకు తరలించిన నేపథ్యంలో పొరుగునే ఉన్న కొలంబియాకు కూడా అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. మాదకద్రవ్యాలను అమెరికాలోకి డంప్ చేసే వారు ఎవరైనా సరే వారికి ఇదే గతి పడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోను ఉద్దేశించి ట్రంప్ పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. 'మదురో తన దేశంలో కొకైన్ తయారుచేసి అమెరికాకు పంపించాడు. అమెరికన్లను మత్తులో ముంచేయ్యాలని చూశాడు. ఇప్పుడు మదురోకు పట్టిన గతి చూశారు కదా. మా దేశంలోకి అక్రమంగా మాదకద్రవ్యాలు పంపించేవారికి ఇదే గతి పడుతుంది' అని ట్రంప్ స్పష్టం చేశారు. కొలంబియా కూడా మాదకద్రవ్యాలను తయారుచేసి అమెరికాలోకి డంప్ చేస్తోందని ట్రంప్ ఇటీవల ఆరోపించారు. ఈ నేపథ్యంలో కొలంబియాలోని డ్రగ్స్ తయారీ లేబరేటరీలపై దాడులు చేసే అంశాన్ని కొట్టిపారేయలేమని చెప్పారు. కాగా, వెనెజులా రాజధాని కరాకస్ పై అమెరికా బలగాల దాడులను కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఖండించారు. ఈ చర్య లాటిన్ అమెరికా సార్వభౌమాధికారంపై జరిగిన దాడేనని విమర్శించారు. ఇది హ్యూమానిటేరియన్ క్రైసిస్ కు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, యాంటీ డ్రగ్ స్ట్రాటజీలో భాగంగా అమెరికా ఇటీవల కరేబియన్ సముద్రంలో తన నౌకలను మోహరించిన విషయం తెలిసిందే. ఈ చర్యను విమర్శించిన పెట్రో.. కొలంబియాలోని డ్రగ్స్ తయారీ లేబరేటరీలపై దాడులు చేస్తామంటూ ట్రంప్ చేసిన పరోక్ష హెచ్చరికలను కూడా ఆక్షేపించారు. కొలంబియా భూభాగంపై దాడులు జరపడమంటే ఆక్రమణకిందే చూస్తామని పెట్రో స్పష్టం చేశారు.

# అమెరికా అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన

న్యూఢిల్లీ: వెనెజులాలో చోటుచేసుకున్న పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా బలగాలు అదుపులోకి తీసుకోవడం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. ఆదివారం నాడు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. గత 24 గంటల్లో వెనెజులాకు సంబంధించి అమెరికా తీసుకున్న చర్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. సుస్థిరమైన అంతర్జాతీయ చట్టాలను ఏకపక్షంగా ఉల్లంఘించలేరు అని పేర్కొన్నారు. శనివారం వెనెజులా రాజధాని కారకాస్‌పై అమెరికా సైనిక దళాలు భారీస్థాయిలో దాడి చేసి, అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకున్నాయి. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు. తాత్కాలికంగా, వెనెజులా పాలనను తామే చూసుకుంటామని కూడా ఆయన స్పష్టం చేశారు. కొన్ని నెలలుగా కొనసాగుతున్న సైనిక సన్నాహాల తర్వాత అమెరికా డెల్టా ఫోర్సెస్ ఈ ఆపరేషన్ నిర్వహించాయి. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నార్కో-టెర్రరిజం వంటి తీవ్రమైన ఆరోపణలపై క్రిమినల్ విచారణ నిమిత్తం మదురోను న్యూయార్క్‌కు తరలించారు. అమెరికా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆయనపై దాఖలు చేసిన అభియోగపత్రాలను బహిర్గతం చేసిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. శనివారం రాత్రి ఆయన న్యూయార్క్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ స్పందనకు సమాంతరంగా, వామపక్ష పార్టీలు కూడా అమెరికా చర్యను తీవ్రంగా ఖండించాయి. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆదివారం నిరసన చేపట్టాయి. వెనెజులాపై అమెరికా సైనిక దురాక్రమణకు పాల్పడిందని సీపీఎం నాయకత్వం ఆరోపించింది. ఆ దేశంలోని చమురు వనరులను చేజిక్కించుకోవడానికే అమెరికా ఈ దాడికి పాల్పడిందని నిరసనకారులు ఆరోపించారు. మరోవైపు, వెనెజులాలో తాజా పరిణామాలు ఆందోళన కలిగించే విషయమని భారత ప్రభుత్వం పేర్కొంది. సంబంధిత పక్షాలన్నీ చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని, ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడాలని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. కారకాస్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామని భరోసా ఇచ్చింది.

# మదురో అరెస్టు యుద్ధ చర్యే

### : న్యూయార్క్ మేయర్

న్యూయార్క్: వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అమెరికా సైన్యం అరెస్ట్ చేయఅబశ్రీశ్రీడం తీవ్ర దుమారం రేపుతోంది. ఒక సార్వభౌమ దేశంపై ఏకపక్షంగా దాడి చేయడం యుద్ధ చర్య కిందకే వస్తుందని న్యూయార్క్ నగర నూతన మేయర్ జోహ్రాన్ మమ్దానీ తీవ్రంగా స్పందించారు. ఈ చర్యపై తన వ్యతిరేకతను తెలియజేసేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నేరుగా ఫోన్ చేసి మాట్లాడానని ఆయన వెల్లడించారు. నార్కో-టెర్రరిజం, మాదకద్రవ్యాల సరఫరా, ఆయుధాల వినియోగం వంటి తీవ్రమైన ఆరోపణలపై నికోలస్ మదురో దంపతులపై న్యూయార్క్‌లో అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం వారిని అమెరికా సైన్యం ప్రత్యేక ఆపరేషన్ ద్వారా బంధించి న్యూయార్క్‌కు తరలిస్తోంది. మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన రెండు రోజులకే ఈ అనూహ్య పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా మేయర్ మమ్దానీ మాట్లాడుతూ... ఈ చర్య కేవలం విదేశాలకే పరిమితం కాదు. న్యూయార్క్‌లో నివసిస్తున్న వేలాది మంది వెనిజులా పౌరులతో సహా అందరిపైనా ప్రభావం చూపుతుంది. వారి భద్రతే నాకు ముఖ్యం అని పేర్కొన్నారు.




# జొమాటోలో ప్రతి నెల 5 వేల మంది తొలగింపు

### మోసాల వల్లే తొలగిస్తున్నామన్న కంపెనీ సీఈవో

న్యూఢిల్లీ: ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటోలో ప్రతినెలా దాదాపు 5,000 మంది గిగ్ వర్కర్లను తొలగించడడం వెనుక ఉన్న అసలు కారణాన్ని కంపెనీ సీఈవో దీపిందర్ గోయల్ వెల్లడించారు. మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడటం వల్లే వారిని తొలగించాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. కేవలం తొలగింపులే కాకుండా, ప్రతి నెలా సుమారు 1.5 లక్షల నుంచి 2 లక్షల మంది వర్కర్లు స్వచ్ఛందంగానే ప్లాట్‌ఫామ్‌ను వీడి వెళుతున్నారని ఆయన తెలిపారు. యూట్యూబర్ రాజ్ శ్యామానీతో జరిపిన ఒక వీడియో పాడ్‌కాస్ట్‌లో గోయల్ ఈ వివరాలను పంచుకున్నారు. గిగ్ వర్క్‌ను చాలామంది ఒక తాత్కాలిక ఉపాధిగానే భావిస్తున్నారని, అందుకే ఇంత పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా వెళ్లిపోతున్నారని ఆయన విశ్లేషించారు. ఇదిలా ఉండగా, మెరుగైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు, భద్రతా కవరేజీ వంటి డిమాండ్లతో జొమాటోతో సహా పలు క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లకు చెందిన గిగ్ వర్కర్లు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. గిగ్ వర్కర్ల నుంచి పెరుగుతున్న డిమాండ్లు, వారి హక్కుల పరిరక్షణ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ నాలుగు కొత్త కార్మిక చట్టాలకు సంబంధించిన ముసాయిదా నిబంధనలను ప్రచురించింది. ఈ కొత్త చట్టాల ద్వారా గిగ్ వర్కర్లకు కూడా కనీస వేతనం, ఆరోగ్యం, వృత్తిపరమైన భద్రత, సామాజిక భద్రత వంటి ప్రయోజనాలను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.


ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
సోమవారం 5-1-2026 | www.evarthalu.com 




## వయ్యారి చిత్రం

## శంకర వర ప్రసాద్ ట్రైలర్ సూపర్

చిరంజీవి, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో రూపొందుతున్న మన శంకర వర ప్రసాద్ గారు ట్రైలర్ ను తాజాగా మేకర్స్ రిలీజ్ చేశారు. తిరుపతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆదివారం మధ్యాహ్నం విడుదల చేశారు. ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా.. మీసాల పిల్ల, శశిరేఖ, మెగా విక్టరీ వంటి పాటలు చార్ట్ బస్టర్లుగా నిలిచి సినిమాపై ఆసక్తిని పెంచాయి. దీంతో మూవీ కోసం అంతా వెయిట్ చేస్తుండగా.. ఇప్పుడు మేకర్స్ రిలీజ్ చేసిన ట్రైలర్ సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారింది. మెగాస్టార్ అభిమానులు ఆశించే అన్ని అంశాలతో ఉన్న ట్రైలర్.. సినిమాపై అంచనాలను పెంచేసింది. ట్రైలర్ లో చిరంజీవి లుక్ అందరినీ ఆకట్టుకుంటుంది. యంగ్ గా, ఫ్రెష్ గా, స్టైలిష్ గా కనిపిస్తూ తన వింటేజ్ కామిక్ టైమింగ్ ను మరోసారి రుచి చూపించారు. ఎనర్జీ, స్టైల్, స్వాగ్, యాక్షన్.. ప్రతి ఫ్రేమ్ లో కూడా మెగాస్టార్ మార్క్ స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన స్టైల్, స్వాగ్ నెవ్వర్ బిఫోర్ లా ఉంది. డైలాగ్ డెలివరీ అభిమానులను తెగ ఆకట్టుకుంటుంది. సినిమాలో చిరంజీవి రా ఏజెంట్, ఎన్ఎస్ఏ అధికారిగా కనిపించనున్నారు. శశిరేఖ అంటూ పిలిచే ప్రతిసారి కూడా వింటేజ్ చిరును గుర్తు చేస్తూ థియేటర్లలో విజిల్స్ పడేలా ఉన్నాయి. అనిల్ రావిపూడి చెప్పినట్లు.. చిరంజీవిని అభిమానులు, తెలుగు ప్రేక్షకులు మిస్ అవుతున్న ఫుల్ ఎంటర్టైనర్ ను అందించానన్న హామీని ట్రైలర్ తోనే నెరవేర్చినట్లు కనిపిస్తోంది.






## మనుషులే అసలు సమస్య

కొంతమంది సెలబ్రిటీలు సోషల్ మీడియాను వాడుకొని తమ అభిప్రాయాలను చెప్తూ ఎన్నో చర్చలకు దారితీస్తూ ఉంటారు. అలాంటి వారిలో ముందుండే పేరు ప్రముఖ సింగర్ డబ్బింగ్, ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద. ఆమె ఇటీవల చేసిన ఒక ఏఐపై వ్యాఖ్యలు మరోసారి సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపాయి. 'ఏఐ ప్రమాదకరం కాదు. దాన్ని వాడే మనుషులే ప్రమాదకరం' అంటూ ఆమె చేసిన వ్యాఖ్య హాట్ టాపిక్ అయింది. దీనిపై ఓ యూజర్ 'ఇప్పటి కాలంలో ఏఐ చాలా డేంజరస్ అవుతోంది' అంటూ కామెంట్ చేయగా.. చిన్మయి తన అభిప్రాయం స్పష్టంగా చెప్పింది. టెక్నాలజీ కంటే దాన్ని మనం ఎలా వాడుతున్నామన్నదే అసలు సమస్య అని తెలిపింది.

## అదీ వైబ్ అంటే..: మాళవిక మోహనన్

మాళవిక మోహనన్ తాజాగా తన ఇన్స్టాగ్రామ్ ప్రొఫైల్ లో ఒక ప్రత్యేకమైన ఫోటోను షేర్ చేసింది. ఆ ఫోటోకు ఆమె దట్స్ ద వైబ్ అనే చిన్న క్యాప్షన్ ఇచ్చింది. క్యాప్షన్ కి తగ్గట్టుగానే ఈ ఫోటోతో అందరికీ వైబ్ ఇచ్చింది ఈ హీరోయిన్. సముద్ర తీరంల..వెనుక పాత రాతి కట్టడాలతో నిలబడి ఉన్న మాళవిక ఫోటో చాలా ఎనర్జీతో కనిపిస్తోంది. ఈ ఫోటో బయటకు వచ్చిన కొద్ది సేపటికే సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మాళవిక లుక్, బ్యాక్‌గ్రౌండ్, ఆమె స్టైల్ అన్నీ కలసి ఒక పాజిటివ్ వైబ్‌ను క్రియేట్ చేశాయని.. ఆమె అభిమానులు కామెంట్లు పెడుతున్నారు.



## శ్రుతి హాసన్ బిల్డప్.. పశ్చాత్తాపం!


పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో సినిమా ఛాన్స్ అనగానే ఏ నటి అయినా ఎగిరి గంతేస్తుంది. తనంత గొప్ప అదృష్ట వంతురాలు మరొకరు ఉండరనే అనుభూతికి లోనవుతారు. డార్లింగ్ తో పని చేయడానికి ఎంతో ముందుకొస్తారు. కానీ శ్రుతిహాసన్ ప్రభాస్ తో ఛాన్స్ అనగానే ఎలా రియాక్ట్ అయిందో తెలుసా? అయితే ఏంటి..! అన్నట్లే అమ్మడి నుంచి తొలి రియాక్షన్ వచ్చినట్లు వెలుగులోకి వచ్చింది. -సలార్- చిత్రంలో శ్రుతిహాసన్ హీరోయిన్ గా నటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా లో ఛాన్స్ రాగానే ఈ విషయం శ్రుతిహాసన్ స్నేహితులకు లీక్ అవ్వడంతో ఫోన్ చేసి మరీ ఎంతో ఎగ్జైట్ మెంట్ కు గురయ్యారుట. మరికొంత మంది డార్లింగ్ తో నటిస్తున్నావ్? అని సంతోషం వ్యక్తం చేసారుట. కానీ ఆ ఎగ్జైట్ మెంట్ గానీ, సంతోషంగానీ శ్రుతిహాసన్ లో ఎంత మాత్రం కలగలేదుట. అంతా కీర్తిస్తుంతుంటే? శ్రుతిహాసన్ ఎంతో ఇబ్బందిగా ఫీలైందిట. అయితే ఎవరికి గొప్ప అన్నట్లు మాట్లాడిందిట. కానీ ప్రభాస్ గురించి తెలిసిన తర్వాత తాను అలా అనుకుని చాలా పెద్ద తప్పు చేసానని రియలైజ్ అయిందట.



## పూజా హెగ్డే రీ ఎంట్రీ!

ముంబై బ్యూటీ పూజాహెగ్డే టాలీవుడ్ లో కంబ్యాక్ కోసం ఏడాదిన్నర కాలంగా ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ అవకాశాల్ని కాదని వెళ్లిన అమ్మడు తిరిగి కోలీవుడ్ కి వచ్చి మళ్లీ తెలుగు ప్రయత్నాలు మొదలు పెట్టినా ఎవరూ ఛాన్స్ ఇవ్వలేదు. అప్పటి నుంచి తమిళ సినిమాలతోనే కాలం గడుపుతోంది. గత ఏడాది -దేవా-, -రెట్రో-, -కూలీ- సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చినా ఏ సినిమా సక్సెస్ ఇవ్వలేదు. ఈ క్రమంలోనే టాలీవుడ్ ప్రయత్నాలు చేసింది కానీ ఫలించలేదు. కానీ ఎట్టకేలకు ఓ హీరో, డైరెక్టర్ కరుణించాడు. దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న 41వ చిత్రంలో హీరోయిన్ గా ఎంపికైంది. ఈ సినిమాతో రవి నేలకుదిటి అనే కొత్త కుర్రాడు డైరెక్టర్ గా పరిచయమవుతున్నాడు. ఈ ఛాన్స్ కూడా ఎన్నో ప్రయత్నాల తర్వాత వచ్చింది. అయితే ఛాన్స్ ఇచ్చింది తెలుగు నటుడు కాదు. దుల్కార్ సల్మాన్ మలయాళం హీరో. తెలుగులో ఇప్పుడిప్పుడే ఫేమస్ అవుతున్నాడు. ఈ సినిమా కి పని చేస్తోన్న దర్శకుడు కూడా కొత్త వాడు. ఈ నేపథ్యంలో పూజాహెగ్డేకి ఛాన్స్ వచ్చింది.





## బ్యూటీఫుల్.. బాంధవి!

టాలీవుడ్ లో కొన్నాళ్ల క్రితం వచ్చిన మసూద సినిమా గుర్తుందా? హారర్ జోనర్ లో రూపొందిన ఆ మూవీ.. అందరినీ మెప్పించింది. ముఖ్యంగా ఆడియన్స్ ను భయపెట్టిందని చెప్పాలి. అందులో ఆత్మ ఆవహించిన అమ్మాయి పాత్రలో నటించిన బాంధవి శ్రీధర్.. తన యాక్టింగ్ తో విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకున్న విషయం తెలిసిందే. నిజానికి ఆ సినిమాలో కావ్య కళ్యాణ్ రామ్ హీరోయిన్ గా నటించినా.. బాంధవి అందరి దృష్టిని ఆకర్షించారు. నాజియా పాత్రలో కనిపించి ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.



# యాషెస్ ఐదో టెస్టుపై నల్లటి మేఘాలు

## వెలుతురు లేమితో 45 ఓవర్లకే ముగిసిన ఆట


సిడ్నీ క్రికెట్ స్టేడియం వేదికగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదో టెస్ట్ మ్యాచ్ తొలి రోజు ఆట ముగిసింది. ఆకాశం మేఘావృతం కావడం, వెలుతురు సరిగా లేకపోవడంతో కేవలం 45 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. అయినప్పటికీ ఇంగ్లాండ్ బ్యాటర్లు జో రూట్, హ్యారీ బ్రూక్ అద్భుత ప్రదర్శనతో జట్టుకు పటిష్టి స్థితిని అందించారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ తన మొదటి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. జో రూట్ 103 బంతుల్లో 8 ఫోర్ల సహాయంతో 72 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఇది ఆయన కెరీర్‌లో 67వ హాఫ్ సెంచరీ. సచిన్ టెండూల్కర్ (68 హాఫ్ సెంచరీలు) రికార్డుకు ఆయన కేవలం అడుగు దూరంలో ఉన్నారు. హ్యారీ బ్రూక్ దూకుడుగా ఆడుతూ 92 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 78 పరుగులు చేసి అజేయంగా నిలిచారు. టాపార్డర్ త్వరగా నిష్క్రమించినా, వీరిద్దరూ కలిసి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అంతకుముందు టాస్ గెలిచిన ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బ్యాటింగ్ ఎంచుకున్నారు. అయితే ఓపెనర్లు మరోసారి విఫలమయ్యారు. బెన్ డకెట్ (27), జాక్ క్రాలీ (16), జాకబ్ బెథెల్ (10) తక్కువ పరుగులకే వెనుదిరిగారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, మైఖేల్ నెసెర్, స్కాట్ బోలాండ్ తలో వికెట్ తీశారు. సిడ్నీ పిచ్ ఎప్పుడూ స్పిన్నర్లకు సహకరిస్తుంది. కానీ ఆశ్చర్యకరంగా ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఒక్క స్పిన్నర్ లేకుండానే బరిలోకి దిగారు. సిడ్నీలో ఆస్ట్రేలియా జట్టు స్పిన్నర్ లేకుండా ఆడటం గత 138 ఏళ్లలో ఇదే మొదటిసారి. ఈ నిర్ణయం ఆస్ట్రేలియాకు ఎంతవరకు కలిసివస్తుందో వేచి చూడాలి.




# నేనేం చేయగలను?: ముస్తాఫిజుర్

బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ అస్థిరత, హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో, బీసీసీఐ ఆదేశాల మేరకు కేకేఆర్ ముస్తాఫిజుర్‌ను జట్టు నుంచి తప్పించింది. ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందే కోల్‌కతా నైట్ రైడర్స్ తనను జట్టు నుంచి విడుదల చేయడంపై బంగ్లాదేశ్ స్టార్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ తొలిసారి మౌనం వీడాడు. జట్టు నుంచి తొలగింపుపై ముస్తాఫిజుర్ స్పందిస్తూ తన నిస్సహాయతను వ్యక్తం చేశారు. 'నన్ను జట్టు నుంచి విడుదల చేస్తే నేను మాత్రం ఏం చేయగలను?' అని నిస్సహాయంగా ప్రశ్నించారు. ఐపీఎల్ 2026 కోసం కేకేఆర్ తనపై చూపించిన నమ్మకాన్ని గౌరవిస్తానని.. అయితే బోర్డు నిర్ణయం ముందు ఎవరూ ఏమీ చేయలేరని ఆయన పేర్కొన్నారు. తాను ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే కేవలం రాజకీయ కారణాల వల్ల జట్టుకు దూరం కావడం పట్ల ఆయన తీవ్ర నిరాశకు గురైనట్లు తెలుస్తోంది.

# ఇంగ్లండ్ కోచ్ రేసులో కుక్?



సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇంగ్లండ్ జట్టుకు కొత్త కోచ్‌ను చూసుకోవాల్సిన రోజులొచ్చేశాయి. అండర్సన్ -టెండూల్కర్ ట్రోఫీలో తడబాటు, యాషెస్ సిరీస్‌లో ఆ జట్టు చెత్త ఆటను చూశాక.. బ్రెండన్ మెక్‌కల్లమ్‌అబశ్రీశ్రీ స్థానంలో కొత్తవారికి బాధ్యతలు ఇవ్వాలనే డిమాండ్స్ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కోచ్ రవి శాస్త్రి అయితేనే మంచిదని ఆ దేశ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ అభిప్రాయపడగా.. మాజీ కెప్టెన్ మాత్రం అలెస్టర్ కుక్ రేసులో ఉన్నాడని అంటున్నాడు. యాషెస్ సిరీస్‌లో బ్యాటింగ్ వైఫల్యంతో ఇంగ్లండ్ చేజేతులా సిరీస్ సమర్పించుకుంది. హ్యాట్రిక్ ఓటములతో లొంగిపోయిన బెన్ స్టోక్స్ ఎట్టకేలకు మెల్‌బోర్న్‌లో విజయంతో మురిసినా.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. దాంతో.. వెంటనే బ్రెండన్ మెక్‌కల్లమ్‌ను తప్పించాలని మాజీ ఆటగాళ్లు అంటున్నారు. తాజాగా ఆ జట్టు మాజీ కెప్టెన్ మైఖేల్ ఆర్థర్టన్ ది టైమ్స్ కథనంలో ఇంగ్లండ్ టెస్టు జట్టుకు కొత్త కోచ్ అవసరాన్ని నొక్కి చెప్పాడు. మెక్‌కల్లమ్ వారసుడిగా అలెస్టర్ కుక్ మంచి ఎంపిక అని అతడు పేర్కొన్నాడు. 'ఇదే విషయమై కుక్‌ను సంప్రదించగా అతడు నేను సిద్ధమే అని అంటున్నాడు. నేను ఏమీ చెప్పలేను. అయితే.. ఆర్థర్టన్ 800 పదాల అర్టికల్‌లో 600 పదాలే పూర్తి చేశాడు. ఇంకా 200 పదాలున్నాయి. ఇప్పటివరకైతే ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు నన్ను సంప్రదించలేదు. ఒకవేళ నన్ను కోచ్‌గా ఎంపిక చేస్తే రఫ్ఫాడిస్తా. కచ్చితంగా ఫలితాలు చూపిస్తాను' అని కుక్ వెల్లడించాడు.



# కోహ్లినే నా ఫేవరెట్

క్రికెట్ ప్రపంచంలో సుదీర్ఘ కాలం పాటు బౌలర్‌గా కొనసాగి 704 టెస్టు వికెట్లు పడగొట్టిన ఇంగ్లాండ్ లెజెండ్ జేమ్స్ అండర్సన్.. సచిన్ టెండూల్కర్, రోహిత్ శర్మ వంటి ఉద్దండులను పక్కనపెట్టి తన ఫేవరెట్ ఇండియన్ క్రికెటర్‌ను ఎంచుకున్నారు. అనేక తరాల భారతీయ బ్యాటర్లను ఎదుర్కొన్న జేమ్స్ అండర్సన్.. అందరికంటే ఎక్కువగా విరాట్ కోహ్లీ తనను ఆకట్టుకున్నాడని పేర్కొన్నారు. విరాట్ కోహ్లీతో సాగించిన పోరాటం అత్యంత చిరస్మరణీయమని ఆయన భావిస్తున్నారు. కోహ్లీ చూపించే దూకుడు, ఆటపై అతనికున్న నిబద్ధత అండర్సన్‌ను బాగా ఆకట్టుకున్నాయి. 2014 ఇంగ్లాండ్ పర్యటనలో కోహ్లీని అండర్సన్ నాలుగు సార్లు ఔట్ చేసి ముప్పతిప్పలు పెట్టారు. కానీ 2018లో కోహ్లీ తిరిగి పుంజుకుని అండర్సన్ బౌలింగ్‌లో ఒక్కసారి కూడా ఔట్ కాకుండా 593 పరుగులు సాధించి గట్టి సమాధానమిచ్చారు.

### అండర్సన్ ఫేవరెట్ ప్లేయర్లు వీరే..

- భారత్-విరాట్ కోహ్లీ
- ఆస్ట్రేలియా-షేన్ వార్న్
- దక్షణాఫ్రికా-ఏబీ డివిలియర్స్
- శ్రీలంక-సనత్ జయసూర్య
- పాకిస్థాన్-బాబర్ ఆజం
- న్యూజిలాండ్-టిమ్ సౌథీ
- ఇంగ్లాండ్ -జో రూట్




# టీ20 వరల్డ్ కప్‌లో బంగ్లా రచ్చ

టీ20 ప్రపంచ కప్ ఆతిథ్యంపై భారత్, బంగ్లాదేశ్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు ఇప్పుడు క్రికెట్ మైదానానికి పాకాయి. రానున్న టీ20 ప్రపంచ కప్‌కు భారత్ వేదికగా నిలుస్తున్న తరుణంలో ఓ కొత్త వివాదం తెరపైకి వచ్చింది. తమ దేశ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్ నుంచి తప్పించడం, భద్రతా కారణాలను సాకుగా చూపుతూ తమ లీగ్ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు డిమాండ్ చేస్తోంది. బంగ్లాదేశ్ ప్రభుత్వ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ ఈ విషయంలో ఐసీసీకి లేఖ రాయాలని తమ క్రికెట్ బోర్డును ఆదేశించారు. ఆయన ప్రధానంగా రెండు అంశాలను ప్రస్తావించారు. రూ.9.20 కోట్ల ఒప్పందం ఉన్నప్పటికీ.. రాజకీయ కారణాలతో ముస్తాఫిజుర్‌ను కేకేఆర్ విడుదల చేయడం తమ ఆటగాళ్లను అవమానించడమేనని బంగ్లాదేశ్ భావిస్తోంది. ఒక స్టార్ ఆటగాడికి భారత్‌లో రక్షణ లేనప్పుడు మొత్తం జాతీయ జట్టు పర్యటించడం క్షమకరం కాదని వారు వాదిస్తున్నారు.

### బీసీసీఐ ఘాటు స్పందన

బంగ్లాదేశ్ డిమాండ్‌ను బీసీసీఐ తీవ్రంగా తప్పుబట్టింది. ఇది ఏమాత్రం సాధ్యం కాని పని అని కొట్టిపారేసింది. టోర్నమెంట్ ప్రారంభానికి కేవలం నెల రోజులే సమయం ఉంది. ఈ తక్కువ సమయంలో వేదికలను మార్చడం అసాధ్యం. కేవలం మైదానాన్ని మార్చడమే కాకుండా.. ఇతర జట్ల ప్రయాణాలు, హెూటల్ బుకింగ్స్, బ్రాడ్‌కాస్టింగ్ సిబ్బంది నిర్వహణ మళ్ళీ మొదటి నుంచి చేయడం కుదరని పని. ఒక దేశం అడిగిందని మొత్తం టోర్నమెంట్ రూపురేఖలను మార్చడం కుదరదని బీసీసీఐ స్పష్టం చేసింది.

# ట్రెండింగ్‌లో బంగ్లా కెప్టెన్ వైఫ్!

బంగ్లాదేశ్ క్రికెట్ జట్టుకు సారథి, హిందూ క్రికెటర్ లిట్టన్ దాస్ ఇప్పుడు క్రీడా ప్రపంచంలోనే కాకుండా సామాజిక మాధ్యమాల్లోనూ హాట్ టాపిక్ అయ్యారు. లిట్టన్ దాస్ వ్యక్తిగత జీవతం, ముఖ్యంగా ఆయన భార్య దేవశ్రీ బిస్వాస్ సంచితకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. దేవశ్రీ బిస్వాస్ సంచిత శ్రీకృష్ణుని పట్ల



అపారమైన భక్తిని కలిగి ఉన్నారు. తనను తాను కృష్ణుని దాసిగా అభివర్ణించుకుంటారు. కేవలం కృష్ణుడే కాకుండా మహాదేవుడు, శ్రీరాముడు, వినాయకుడు, లక్ష్మదేవి, కాళికా మాతను భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. బంగ్లాదేశ్‌లో ఉంటూనే హిందూ పండుగలైన హెూలీ, దీపావళి, దసరా వంటి వాటిని ఈ దంపతులు ఎంతో ఘనంగా జరుపుకుంటారు. దేవశ్రీ సంచిత చదువులో ఎంతో ప్రతిభావంతురాలు. షేర్-ఎ-బంగ్లా అగ్రికల్చరల్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. అయితే ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ బయోలో తనను తాను ఒక రైతుగా పేర్కొనడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. వ్యవసాయం పట్ల ఆమెకున్న మక్కువ, మూగజీవాల పట్ల ఆమె చూపే ప్రేమ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. లిట్టన్ దాస్, దేవశ్రీ బిస్వాస్ సంచిత చాలా కాలం పాటు ప్రేమలో ఉండి, 2019లో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. అయితే పెళ్లయిన ఏడాదికే (2020లో) సంచిత ఒక పెద్ద ప్రమాదానికి గురయ్యారు. వంటింట్లో టీ చేస్తున్న సమయంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఆమె గాయపడ్డారు. ఆ క్లిష్ట పరిస్థితుల నుండి కోలుకుని ఆమె మళ్లీ సాధారణ జీవితంలోకి వచ్చారు.

# స్పృహలోకి మార్టిన్



ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామిన్ మార్టిన్ కళ్లు తెరిచాడు. కొన్ని రోజులుగా కోమాలో ఉన్న అతడు ఆదివారం స్పృహలోకి వచ్చాడు. కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నాడు కూడా. దాంతో, ఇది కలా? నిజమా? అని డాక్టర్లు సైతం ఆశ్చర్యపోతున్నారు. కోమా నుంచి కోలుకున్న మార్డిన్ ఆరోగ్యం రోజురోజుకు మెరుగవుతోందని వైద్యులు తెలిపారు. త్వరలోనే అతడిని ఐసీయూ నుంచి వేరే వార్డుకు తరలిస్తామని చెప్పారు. ఒకప్పుడు విధ్వంసక ఆటగాడైన డామిన్ మార్టిన్ మెనింజిటైటిస్ జబ్బుతో బాధపడుతున్నాడు. 54 ఏళ్ల వయసున్న మార్టిన్ డిసెంబర్ 26న తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో, కుటుంబసభ్యులు అతడిని వెంటనే బ్రిస్బేన్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ మార్టిన్ అరోగ్యం మరింత క్షిణించడంతో ఐసీయూలో చికిత్స అందించారు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
సోమవారం 5-1-2026



# విశ్వం.. ఏమిటీ మాయ!



“ అనంత విశ్వంలో మనం ఎక్కడ ఉన్నాం?
ఎలా ఉన్నాం? మనల్ని సృష్టించింది ఎవరు?
ఎవరికీ అంతు పట్టని ఓ మిస్టరీ.. ”

సైన్స్ అంతరిక్షంలో తెగ షికారు చేసేస్తోంది. అన్ని గ్రహాల అంతర్యాన్ని కనిపెట్టి తీరుతానని సవాలు చేసింది.. కానీ, సృష్టిలో తొలి జీవి ఎలా ఉద్భవించిందన్నది. దానికి ఇంతవరకు అర్థం కాలేదు.. మొదలు తెలవటం లేదు.. తుది ఏమిటో కనిపించటం లేదు.. ఏదో అంతు తెలియని శక్తి మనల్ని నడిపిస్తోందని అన్ని మతాలూ చెప్తున్నాయి. దేవుడు ఉన్నాడని, ఆ దేవుడే ఈ సృష్టిస్థితి లయలకు కారణమని ఘంటాపథంగా చెప్తున్నాయి. ఇదే నిజమా? దేవుడు ఉన్నాడా? ఆ దేవుడే ఈ అనంత విశ్వానికి నాయకుడా?

**మనిషి ఎలా పుట్టాడు..? వేల సంవత్సరాల నుంచి ఒకతరాన్ని మరో తరం అడుగుతున్న ప్రశ్న ఇది.**

కోతిలో కొన్ని పోలికలున్నాయని కోతి నుంచి మనిషి పుట్టాడన్నారు. కానీ ఆ కోతి ఎలా పుట్టింది? అసలు భూమిపై జీవి ఎలా పుట్టింది? ఎలా పెరుగుతోంది? ఎలా చనిపోతోంది? ఈ సృష్టి వెనుక దాగున్న రహస్యం ఏమిటి? అన్నీ సందేహాలే.. ఈ సృష్టిని నడిపిస్తున్నదీ, నాశనం చేస్తున్నదీ ఒక మహాశక్తి.. ఏమిటా శక్తి.. దైవమాయేనా? మరేదైనా ఉందా? ఈ భూమిపై జరుగుతున్న అన్ని పరిణామాలకు, మార్పులకు అంతరిక్షంలో ఏదో ఒక మీట కారణమవుతోంది.. ఆ మీటను అనంత రోదసిలో కూర్చుని ఎవరో నొక్కుతున్నారు.. దాని కారణంగానే ఈ భూమిపై సృష్టి స్థితి లయలు జరుగుతున్నాయి. ఆ మీట నొక్కుతున్నదెవరు? బ్రహ్మా? విష్ణువా? మహేశ్వరుడా? లేక ఆదిశక్తా.. విశ్వంలో మనకు తెలియని మహాలోకాల్లో వీరు ఉన్నారా? విశ్వంలో భూమి పరిమాణం ఎంత? సౌర మండలం ఎలా ఏర్పడింది? గ్రహాలు తిరుగుతున్నాయి.. సూర్యుడు కదలటం లేదు. సూర్యుడి చుట్టూనే గ్రహాలన్నీ ఎలా తిరుగుతున్నాయి? మిల్కీవే అంటే ఏమిటి? పాలసముద్రమే పాలపుంతా? సూర్యుడే శ్రీమన్నారాయణుడా? ఈ విశ్వాన్ని నడిపిస్తున్నది ఆయనేనా? అన్నీ సందేహాలే. దేనికీ సమాధానం దొరకటం లేదు.. ఎవరి విశ్లేషణలు వారు చేస్తున్నారు. ఎవరి వ్యాఖ్యానాలు వారు చేస్తున్నారు. కానీ, అన్నింటిలోనూ ఒక అంతస్సూత్రం ఏమంటే.. భూమిని దాని పైనుంచి ఏదో ఒక శక్తి ప్రభావితం చేస్తున్నదని.

లక్షల సంవత్సరాలుగా భూమిపై సృష్టి జరుగుతోంది.. మనిషి పుడుతున్నాడు.. చనిపోతున్నాడు... అదే సమయంలో భూ వాతావరణంలో అనుకోని మార్పులు అనేకం జరుగుతున్నాయి. భూమి లోపలి పొరల్లో కలిగే కదలికలు.. భూమి అంతరాలల్లో పలకల మధ్య, అణువులు, పరమాణువుల మధ్య కలిగే సంఘర్షణల వల్ల విపత్తులు సంభవిస్తాయన్నది సైన్స్ చెప్తుంది. కానీ ఈ సంఘర్షణకు సైతం కారణం పైన అన్నింటికీ అతీతంగా ఉండే ఒకానొక శక్తి అన్నది మతాలు చెప్తున్నాయి. ఈ శక్తే దైవశక్తి అన్నది అన్ని మతాలు అంగీకరిస్తున్న సత్యం.. ఈ రెంటిలో ఏది నిజం? దేవుడు ఎక్కడున్నాడో మనకు తెలియదు. కానీ, రోదసిలో ఎవరికీ తెలియని ఒక శక్తి మాత్రం సమస్త విశ్వాన్ని నిర్వహిస్తోంది. ఇది అనంతమైన శక్తి.. వేల సూర్యుల వేడి దీని ముందు కొరగాదు. అంతటి మహాశక్తి ఎలా ఏర్పడింది? అది సృష్టిని ఎలా నిర్వహిస్తోంది? దాని రహస్యం ఏమిటన్నది ఛేదించటం సైన్స్ తరం కావటం లేదు. భూమి రోదసిలో ఒక భాగం. భూమి పై ఎలాంటి వాతావరణ మార్పులు జరిగినా స్పేస్ ఇంపాక్ట్ వాటిపై ఉంటుంది. ఈ స్పేస్ ఇంపాక్టే రోదసిలో ఎవరికీ కనిపించని శక్తి. అదే మహాశక్తి.. దైవశక్తి, అంతరిక్షంలో భూమికి ఉన్న స్థానం ఏమిటి? మనకు తెలిసిన ఈ ప్రపంచం యూనివర్స్లో ఓ చిన్న బిందువు మాత్రమే.. భూమిని మించిన గ్రహాలు, అగ్ని గోళాలు, నక్షత్రాలు కోట్ల కొలది రోదసిలో ఉన్నాయి. సూర్యుడి కంటే వేల రెట్లు ఎక్కువున్న గ్రహాలు ఉన్నాయి. కృష్ణబిలం అంటే బ్లాక్ హెూల్. లోతుల్లోపల ఏముంది.. దానికి అంతం అంటూ ఉందా? వేల కోట్ల మిల్కీవేలు యూనివర్స్లో ఉన్నాయి. అవి ఎన్ని ఉన్నాయి? ఇవే దేవలోకాలా? వీటినుంచే ఎనర్జీ మన భూమిపైకి వస్తోందా అన్న ప్రశ్నలకు జవాబు ఇప్పటికైతే లేదు.

దైవశక్తి మాటెలా ఉన్నా రోదసినుంచి వచ్చే ఎనర్జీ మనిషి మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నది వాస్తవం. అతి వేడి.. అతి చల్లదనం, ఉరుములు.. మెరుపులు అన్నింటి వెనుకా ఈ ఎనర్జీయే ప్రధాన భూమిక నిర్వహిస్తోందన్నది. నిజం. మనిషి చుట్టూ ఈ ఎనర్జీ ఆవరించి ఉంది. ఇదే కాస్మిక్ ఎనర్జీ.. భూమిపైన జీవి మనుగడ అంతా ఆధారపడి ఉన్న ఎనర్జీ. అణువు నుంచి పరమాణువును మనం ఛేదించాం.. భూమిపైన అతి పెద్ద విస్ఫోటనం అణ్వస్త్ర ప్రయోగం.. మనం కష్టపడి పరిశోధనలు చేసి నిర్వహించిన భారీ పరీక్ష కానీ, మన ప్రయత్నం లేకుండానే.. వివిధ ప్రాంతాల్లో, వివిధ డిగ్రీల్లో, వివిధ తీవ్రతల్లో వేల విస్ఫోటనాలు రోదసిలో ప్రతిక్షణం జరుగుతుంటాయి. వీటిలోంచి వెలువడే ఎనర్జీ అత్యంత తీవ్రంగా ఉంటుంది.. ఈ ఎనర్జీ మిగతా రోదసితోపాటే, జీవజాలం ఉన్న భూమినీ తాకుతుంది. ఈ ఎనర్జీ లెవల్స్ అంతుపట్టకుండా ఉంటాయి. ఇవి మన సైన్సు సవాలు చేస్తున్నాయి. స్పేస్ లో వెలువడే ఈ శక్తి అతి గొప్ప కాస్మిక్ శక్తి.. గోళాల్లా ఉండే గ్రహాలు పిన్బాల్ గేమ్లో మాదిరిగా మూవ్ అవుతుంటాయి. ఈ మూమెంట్ నుంచి రోదసిలో కనీవినీ ఎరుగని శక్తి వెలువడుతుంది.. ఇది కాస్మిక్ ఎనర్జీ.. ఈ ఎనర్జీ మనం మన మనుగడ కోసం వినియోగిస్తున్న ఎనర్జీకి లక్షల రెట్లు ఎక్కువ. లక్షల పేలుళ్లు ఎలా సంభవిస్తున్నాయి. వీటి నుంచి వెలువడుతున్న కాస్మిక్ కిరణాలు భూమిపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తున్నాయి? మనిషికి అంతుపట్టని ఈ మహాశక్తి తీవ్రత ఏమిటి? ఇవాళ మనిషి మేధస్సు ప్రధానంగా ఆలోచించేది ఎనర్జీ.. మన సమాజానికి, ప్రజల అవసరాలకు ఎనర్జీ అనేది ఓ నిత్యావసరం. కానీ ఇది ఎక్కడి నుంచి వస్తుంది? అనంత రోదసిలో లక్షల రెట్లు వెలువడుతున్న శక్తి కేంద్రాల మధ్యలో మనం ఎక్కడ వున్నాం? ఎనర్జీ అంటే యాక్టివిటీ.. ఎనర్జీ అంటే వర్క్ నిరంతరం పని చేసేది. చైతన్యాన్నిచ్చేది. అది ఏ రూపంలోనైనా ఉండవచ్చు.

థర్మల్ పవర్, కెనటిక్, విండ్ పవర్, ఎలక్ట్రో మాగ్నటిక్, కెమికల్, గ్రావిటేషనల్... ఇలా రూపాలు వేరైనా శక్తి రూపాలు ఒక్కటే. ఇది మార్పిడికి గురవుతుంది. తీవ్రంగా ఉంటుంది.. కానీ, నష్టం కాదు. కాస్మిక్ కిరణాల ప్రభావం ఇంతకంటే తీవ్రంగా ఉంటుంది. భూమిపైకి ప్రోటాన్ల రూపంలో, హీలియమ్ రూపంలో మరో రూపంలో కాస్మిక్ కిరణాలు వస్తున్నాయి. వాతావరణంలో అనేక మార్పులకు కారణమవుతున్నాయి. మనిషి చుట్టూనే కాదు.. భూమి చుట్టూ కాస్మిక్ ఎనర్జీ స్పెక్ట్రమ్ ఆవరించి ఉంది. రెండు వందల కార్ల నుంచి వెలువడే ఎనర్జీ 20వేల వాట్లు ఉంటుంది. అదే ఒక రైలు నుంచి అయిదువేల వాట్ల ఎనర్జీ వస్తుంది.. ఒక ఎయిర్ క్రాఫ్ట్ నుంచి 200 మిలియన్ వాట్స్... మనిషి అత్యంత అధికంగా ప్రొడ్యూస్ చేస్తున్న హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ నుంచి పది బిలియన్ వాట్ల ఎనర్జీ కంటే ఎక్కువ ఉండదు.. రాకెట్ ప్రయోగంలో సెకన్కు 15 టన్నుల ఇంధన వినియోగంతో 190 బిలియన్ వాట్ల శక్తి విడుదలవుతుంది. నిజానికి మానవ సమాజానికి ఎంత శక్తి అవసరం అవుతోంది? మనం ఎంత వినియోగిస్తున్నాం? ఒక్కసారి మనల్ని మనం ప్రశ్నించుకుంటే అర్థం అవుతుంది. సూర్యుడి నుంచి భూమికి చేరుతున్న ఎనర్జీ 170 క్వాడ్రా బిలియన్ వాట్లు.. మీకు తెలుసా? సముద్ర తరంగం ఒక్కటి పైకి ఎగిసిపడితే అందులో నుంచి వంద వాట్ల శక్తి వెలువడుతుందట. మనం రోజూ తీవ్ర స్థాయిలో చేసే ఎక్సర్సైజ్ వల్ల సుమారు వెయ్యి వాట్ల శక్తి వెలువడుతుంది.. అదే కాస్మిక్ కిరణాల నుంచి వెలువడే ఎనర్జీ బిలియన్ల బిలియన్ వాట్లు, ఇంత ఎనర్జీతో కొన్ని లక్షల భూగోళాలపై జీవ సమాజం అవసరాలు తీర్చవచ్చు.

ఉపగ్రహాల ప్రయోగాలు అవసరం లేదు.. సహజ వాయువు కోసం తాపత్రయపడనవసరం లేదు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులు అక్కర్లేదు. కల్పాంతం వరకు భూమి దిగుల్లేకుండా ఉండవచ్చు. ఎనర్జీ.. ఇవాళ మనకు చాలా కీలకమైన అవసరం.. ఇది లేకుండా భూమి మనుగడే కష్టమైన దశలో మనం ఉన్నాం. లైఫ్ ఫోర్స్కు ఎనర్జీ ఆక్సిజన్ లాంటిది. కాస్మిక్ ఎనర్జీ ఇందుకు భిన్నం. సాధారణ శక్తి చైతన్యానికి, అన్నింటికీ అతీతమైన శక్తి చైతన్యానికి మధ్య ఉన్న అంతరం కాస్మిక్ ఎనర్జీ.. విజ్ఞాన శాస్త్రానికి, ఆధ్యాత్మిక చింతనకు మధ్య ఉన్న తేడా కాస్మిక్ ఎనర్జీ. విజ్ఞాన పరంగా చూస్తే ఒక విధంగా, స్పిర్చ్యువల్ దారిలో మరో విధంగా కనిపించినా.. మనిషిని శక్తిమంతుణ్ణి చేసేది కాస్మిక్ ఎనర్జీ అన్న అంశాన్ని రెండూ ఒప్పుకున్నవే. గ్రావిటేషన్ అనేది భూమిపైనే ఉందా? రోదసిలో మరెక్కడైనా ఉందా? వుందని రోదసిలో బ్లాక్హోల్ నిరూపిస్తోంది. అంతరిక్షంలో గ్రహాలను మింగేసే స్థాయిలో బ్లాక్హోల్స్ ఉన్నాయి. ఇవి ఆవిర్భవించటంలోనూ కాస్మిక్ ఎనర్జీయే కారణం. స్పేస్లో కాస్మిక్ ఎనర్జీ అత్యంత తీవ్ర స్థాయిలో ఉంటుంది.. నక్షత్రాల మధ్య సంఘర్షణ కావచ్చు... లైఫ్ అయిపోయిన నక్షత్రాలు పేలిపోవటం వల్ల కావచ్చు. కాస్మిక్ ఎనర్జీ అనేది స్పేస్లో ఊహించని స్థాయిలో ఉంటుంది. కాస్మిక్ ఎనర్జీ అనేది అన్ని శక్తులను మించిన శక్తి. మహాశక్తి... మనిషికి అన్ని విధాలా అత్యవసరమైన శక్తి. ఇది కేవలం స్పేస్ ఏరియాలోనే లేదు.. కాస్మోస్లోని అన్ని ప్రాంతాల్లో ఉంది, గేలక్సీలలో, గ్రహాలలో, మనుషుల్లో, అణువుల్లో, పరమాణువుల్లో అంతటా కాస్మిక్ ఎనర్జీ విస్తరించి ఉంది. ఇది రకరకాల రూపాల్లో వెలువడుతుంటుందని సైన్స్ ఇప్పటికే నిరూపించింది.

రోదసిలో రకరకాల విస్ఫోటనాల నుంచి అంతర్లీనంగా వెలువడే ఈ శక్తి క్రమంగా విశ్వాన్ని ఆవరించింది. అంతరిక్షం నుంచి భూమిని ఒక వలయాకారంలో కాపాడుతున్న ఆదిశక్తి ఇదే. మన జీవితానికి అత్యంత అవసరమైన శక్తి కాస్మిక్ ఎనర్జీ.. మేధస్సును పూర్తి స్థాయిలో యాక్టివేట్ చేస్తుంది.. మన ప్రతి పనికీ పునాది ఈ కాస్మిక్ ఎనర్జీయే. పూర్తి నిద్రలో వున్నప్పుడు మనకు ఈ శక్తి అందుతుంటుంది. మన చూపులో, మాటలో, వినటంలో, ఆలోచనల్లో అన్నింటా ఈ ఎనర్జీ ప్రభావం ఉంటుంది. పిన్డ్రాప్ సైలెన్స్లో ఉన్నప్పుడు సైతం మనిషి కాస్మిక్ ఎనర్జీని అందుకుంటాడు. నిశ్శబ్ద వాతావరణంలో వినిపించే శబ్దం ప్రణవం.. అంటే ఓంకారం.. సైంటిఫిక్గా రుజువైన సత్యం ఇది. కాస్మిక్ ఎనర్జీకి ఈ ప్రణవమే ప్రతీక. ఈ ఎనర్జీ మనలో విల్ పవర్ను పెంచుతుంది. అందుకే కాస్మిక్ ఎనర్జీని పొందేందుకు మనవాళ్లు ధ్యానాన్ని మార్గంగా ఎంచుకున్నారు. దీని గురించి హిందూ ధర్మంతో పాటు ప్రపంచంలోని అన్ని మతాలూ గ్రహించాయి. చర్చించాయి. సాధించమని ప్రబోధించాయి. దీనికే మనవాళ్లు మాయ అని పేరు పెట్టారు.. మహాశక్తి అన్నారు.. ఆదిశక్తి అన్నారు.. దైవం అన్నారు.





కోవెల సంతోష్ కుమార్
రచయిత, 91 9052116463

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.